



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

2-10-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 243 పేజీలు: 16 వెల: 6.50










# ప్రపంచ ఉద్యాన కేంద్రం

## రాయలసీమ రైజింగ్

గౌ॥ కేంద్ర ఆర్థిక మంత్రి

**శ్రీమతి నిర్మలా సీతారామన్ గారిచే**

గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

**శ్రీ నారా చంద్రబాబునాయుడు**

మరియు గౌ॥ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి

**శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గార్ల సమక్షంలో**

**రాయలసీమ స్వర్ణ భవిష్యత్తు కోసం**

**రూ.1 లక్ష కోట్ల అభివృద్ధి ప్రణాళికకు శ్రీకారం మరియు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ISA)కు శంకుస్థాపన**

తేదీ & సమయం : అక్టోబర్ 2, 2026, ఉదయం 11 గంటలకు స్థలం : బీకే పల్లి, మదనపల్లె, అన్నమయ్య జిల్లా

10 జిల్లాల్లో 201 క్లస్టర్లలో అభివృద్ధి ప్రణాళిక

2029 జూలై నాటికి అదనంగా 6 లక్షల హెక్టార్ల ఉద్యానసాగు లక్ష్యం

మొత్తం 14.41 లక్షల హెక్టార్లలో ఉద్యానసాగు

(ISA) వ్యవసాయ నాయకత్వం, ఆవిష్కరణ & వాణిజ్యం కోసం ఉత్తమ అంతర్జాతీయ కేంద్రం



9.6 లక్షల మంది రైతులకు ప్రయోజనం

పల్లెల్లో 5,721 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం

నీటిపారుదల ప్రాజెక్టులతో 9 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అభివృద్ధి, 4.3 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ



రాయలసీమను 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ద వరల్డ్' గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం : fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

2-10-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 243 పేజీలు: 16 వెల: 6.50

కల్కి భగవాన్‌కు ఘనంగా నివాళులు 2

2027 అక్టోబరు 2 నుంచి వన్డే వరల్డ్ కప్ 7

# 10జిల్లాల్లో హార్టికల్చర్ హబ్

## లక్ష కోట్ల నిధులతో భారీ ప్రాజెక్టు

రాయలసీమలో సరికొత్త ఉద్యాన వెలుగులు

'పూర్వోదయ' కోసం రూ.60వేల కోట్ల పెట్టుబడులు

రేపల్లెలో పెన్షన్లు పంపిణీ చేసిన సిఎం చంద్రబాబు



గురువారం రేపల్లె పట్టణంలో జరిగిన ప్రజావేదిక సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు, హాజరైన ప్రజానీకం

**రేపల్లె, అక్టోబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అనంతరపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, తిరుపతి, కడప, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో రూ.లక్ష కోట్ల నిధులతో గ్లోబల్ హార్టికల్చర్ కింద అభివృద్ధి పనులను ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టనుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. గురువారం బాపట్ల జిల్లాలోని రేపల్లె పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ అనంతరం ప్రజాసేవలో భాగంగా ప్రజావేదికపై ఆయన ప్రసంగించారు. రాయలసీమ చరిత్రను మార్చే విధంగా గ్లోబల్ కల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. పూర్వోదయ నిధులతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ పేరిట భారీస్థాయిలో అభివృద్ధి పనులను తనతో పాటు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభిస్తారని ప్రకటించారు. విత్తనం వేసే దగ్గర్నుంచి విదేశాలకు సైతం ఉత్పత్తులను ఎగుమతి చేసే వరకు ఉద్యానవన రైతులకు అండగా నిలిచే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమానికి అంకురార్పణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్వోదయ పతకం ద్వారా రూ.40 వేల 352 కోట్ల నిధులను ప్రభుత్వం సమకూరుస్తుంటే ప్రవేట్ రంగం నుంచి రూ.60 వేల కోట్లు పెట్టుబడులు రాబట్టే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చంద్రబాబు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 10 జిల్లాల్లోని 5869 గ్రామాలలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అదే విధంగా 201 క్లస్టర్లలో అత్యంత ప్రతిష్టాత్మకంగా హార్టికల్చర్ హబ్ పనులను ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో 8.41 లక్షల హెక్టార్లలో కొనసాగుతున్న హార్టికల్చర్ సాగును 6 లక్షలకు హెక్టార్లకు విస్తరించి 14.41 లక్షల హెక్టార్లకు ఉద్యానవన సాగును పెంచేలా ప్రణాళికలను రూపొందించామన్నారు. ప్రస్తుతం 222 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న హార్టికల్చర్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 435 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చేలా లక్ష్యాన్ని నిర్ధారించినట్లు తెలిపారు. హార్టికల్చర్ హబ్ ద్వారా 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. నూతనంగా 9లక్షల ఎకరాల ఆయకట్టుతో పాటు 4.3 లక్షల ఎకరాల స్థిరీకరణ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రబాబు వివరించారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్ కింద చేపట్టే అభివృద్ధి పనుల్లో భాగంగా భారీగా ఇరిగేషన్ >>2




# బిసిల 34% రిజర్వేషన్లకు 'నో'

## రెండు జీవోలను కొట్టేసిన హైకోర్టు

మొత్తం రిజర్వేషన్లు 50శాతం దాటరాదని స్పష్టీకరణ

**అమరావతి,అక్టోబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని పేర్కొంది సర్‌పక్రియ ముగిశాకే స్థానిక ఎన్నికలు జరపాలంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు వార్డుల పునర్విభజనపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఏపీలో స్థానిక ఎన్నికలపై రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎన్నికల ప్రక్రియను ఆరు వారాల్లోపు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. గ్రామ పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలతో ముడిపడి ఉన్న వ్యాజ్యాలపై ఇప్పటికే విచారణ పూర్తి చేసిన హైకోర్టు తీర్పులను రిజర్వు చేసింది. ఆ పిటిషన్లపై తాజాగా ఆదేశాలు జారీ చేసింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల విషయమై సుప్రీంకోర్టుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 34శాతం కోటాతో మొత్తం రిజర్వేషన్లు 50శాతం పరిమితిని దాటుతున్నాయంటూ జీవో 105, 1065లను హైకోర్టు రద్దుచేసింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామంటున్న >>2

# 'సుప్రీం'కు వెళ్తాం: సిఎం చంద్రబాబు



**అమరావతి,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** బీసీ రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎన్టీఆర్ కాలం నుంచి బీసీలకు అండగా ఉన్నామని అన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను తాము అమలు చేశామని చెప్పారు. గొడ్డలి పార్టీ రిజర్వేషన్లను కత్తిరించి 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ 34 శాతానికి రిజర్వేషన్లను పెంచామన్నారు. దీనిపై గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లు అడ్డుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. >>2

# వింటర్‌లో సమ్మర్!

## అక్టోబరు-డిసెంబరు మధ్య మరింత వేడి: ఎల్‌నినోపై ఐఎండి అంచనా

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** దేశంలో నైరుతి రుతుపవనాల కాలం ముగిసిందని భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ యేడాది వర్షాకా లం మొత్తంగా 13 శాతం లోటు వర్షపాతంతో ముగిసిపోగా గురువారం నుంచి శీతాకాలం ప్రారంభమైంది. ఇక ఎల్ నినో ప్రభావంతో ఈ శీతాకాలం హాట్ హాట్‌గా ఉండబోతోందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. రాబోయే నవంబరు-డిసెంబరులోనూ చలితీవ్రత తక్కువగా నమోదుకానుందని, అక్టోబరులో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న అక్టోబరు - డిసెంబరు కాలంలోనూ మెజారిటీ ప్రాంతాల్లో పొడి వాతావరణమే రాజ్యమేలనుంది. ముఖ్యంగా అక్టోబరు నెలలో దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పాటు పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పైపైకే చేరతాయని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్ నినో ప్రభావమే ఇందుకు ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సెప్టెంబరు మధ్యలోనే ఎండాకాలాన్ని తలపించిన వాతావరణం రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**1901 తర్వాత 13వ అత్యల్ప వర్షపాతం.. తీవ్ర నిరాశలో మాన్సూన్:** జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు కొనసాగిన నైరుతి రుతుపవనాల కాలంలో దేశంలో ఆశించిన వర్షాలు కురవలేదు. దేశవ్యాప్తంగా దీర్ఘకాలిక సగటులో కేవలం 87శాతం వర్షపాతం మాత్రమే నమోదైంది. మొత్తం రికార్డైన 759.4 మి.మీ వర్షపాతం.. 2001 తర్వాత 4వ అత్యల్పం కాగా, 1901 నుంచి చూస్తే 13వ అత్యల్ప వర్షపాతంగా నమోదైంది.

**ప్రాంతాల వారీగా తీవ్ర లోటు** తూర్పు, ఈశాన్య భారతంలో కేవలం 1016.3 మి.మీ మాత్రమే వర్షం కురవడంతో 1901 తర్వాత సరికొత్త అత్యల్ప రికార్డు నమోదైంది. అలాగే దక్షిణ ద్వీపకల్పంలో 542.0 మి.మీ వర్షపాతం పడగా, ఇది2001 తర్వాత 2వ అత్యల్పం. వ్యవసాయానికి కీలకమైన మాన్సూన్ కోర్ జోన్‌లో 779.9 మి.మీ వర్షపాతం మాత్రమే కురిసింది. దేశంలోని 36 వాతావరణ సబ్ డివిజన్స్‌లో ఏకంగా 17 ఉప విభాగాల్లో లోటు వర్షపాతం రికార్డయింది. 18 సబ్ డివిజన్స్‌లో సాధారణ వర్షపాతం నమోదు కాగా దేశంలో కేవలం ఒకే ఒక్క సబ్ డివిజన్ అయిన ఒడిశాలో మాత్రమే సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

**నెలవారీ గణాంకాలు:** జూన్‌లో 65శాతం, జులైలో 101శాతం, ఆగస్టులో 84శాతం, సెప్టెంబర్‌లో 92శాతం వర్షపాతం నమోదైంది. సీజన్ మొత్తం మీద 14 అల్పపీడన వ్యవస్థలు ఏర్పడినా, జూన్ నెలలో ఒక్కటి కూడా ఏర్పడకపోవడం తొలిదశలో తీవ్ర వర్షాభావానికి >>2

# 6 వారాల్లోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ

## ఇసికి హైకోర్టు ఆదేశం

**విజయవాడ,అక్టోబరు1, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలపై తీవ్ర నెలకొన్న ఉత్కంఠను ఏపీ హైకోర్టు తీర్పు తొలిగించింది. ఎన్నికల నిర్వహణకు లైన్ క్లియర్ చేస్తూ కీలక తీర్పునిచ్చింది. ఏపీలో స్థానిక ఎన్నికలపై రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎన్నికల ప్రక్రియను ఆరు వారాల్లోపు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. గ్రామ పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలతో ముడిపడి ఉన్న వ్యాజ్యాలపై ఇప్పటికే విచారణ పూర్తి చేసిన హైకోర్టు తీర్పులను రిజర్వు చేసింది. ఆ పిటిషన్లపై తాజాగా ఆదేశాలు జారీ చేసింది. సర్ ప్రక్రియ ముగిసిన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేలారాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ వైసీపీ వేసిన వ్యాజ్యాన్ని ధర్మాసనం డిస్పోజ్ చేసింది. బీసీ జనగణన చేపట్టి, రిజర్వేషన్ ఖరారు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ దాఖలైన పిల్‌నూ హైకోర్టు >>2

# నెలలో డిఎస్సీ 2.0 నోటిఫికేషన్



గురువారం అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేష్

## టెన్‌లో అత్యుత్తమ ఫలితాల కోసం మిషన్ మార్చ్

డ్రాపౌట్స్‌పై షణ్ముగం సూచనలు అమలు

ఎయు శతాబ్ది సందర్భంగా విశాఖలో భారీ గ్రంథాలయం

అధికారులతో సమీక్షలో మంత్రి లోకేష్

**అమరావతి,అక్టోబరు1.ప్రభాతవార్తప్రతినిధి:** నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేయడానికి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... నోటిఫికేషన్ విడుదల నుంచి అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చే వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని అన్నారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ రిక్రూట్ మెంట్ మోడల్‌ను ఆసక్తిగా గమనిస్తోంది, మనం అనుసరిస్తున్న విధానాలనే ఇతర రాష్ట్రాలు అనుసరించే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా మిషన్ మార్చ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. బడి మానేసే (స్కూల్ డ్రాపౌట్) పిల్లలు భవిష్యత్తులో మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడటం, అనేక సామాజిక సమస్యలకు దారితీస్తున్నట్లు ఇటీవల తిరుపతి వచ్చిన సింగపూర్ హోం మంత్రి షణ్ముగం చెప్పారని, ఈ అంశాన్ని అధికారులంతా గమనంలోకి తీసుకోవాలన్నారు. డ్రాప్ అవుట్స్ నివారణలో కమ్యూనిటీ లీడర్లను భాగస్వాములను చేసి జీరో డ్రాప్ అవుట్ మిషన్ చేపట్టాలని సూచించారు. యువత పెడదారి పట్టకుండా ఇప్పటికే డ్రగ్స్ వద్దు బ్రో వంటి ప్రచార కార్యక్రమాలను పెద్దఎత్తున అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన నిడమర్రు స్కూల్ సందర్శనకు త్వరలో సింగపూర్ మంత్రి షణ్ముగంను ఆహ్వానిస్తామని చెప్పారు. రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 స్కూళ్లను గుర్తించి, లీప్ స్కూల్స్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. విద్యాశాఖలో రాష్ట్రపతి ఉత్తర్వులు 2025 అమలు విధివిధానాలపై సమీక్షించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఉన్నత విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా స్పందిస్తూ అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తయింది, డిసెంబర్‌లో రాత పరీక్ష నిర్వహణకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లుచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో క్యాంపస్‌ల ఏర్పాటుకు జేఎస్ఎస్ యూనివర్సిటీ, థాపర్ యూనివర్సిటీ, యూపీఈఎస్, జేయూఎస్ యూనివర్సిటీ, బెన్నెట్ యూనివర్సిటీ, సవిత యూనివర్సిటీ వంటివి ఆసక్తి చూపుతున్నాయని అధికారులు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలని, త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ (ట్రాన్స్‌ఫర్మేషన్) ప్రోగ్రామ్ అమలుపై మంత్రి లోకేష్ సమీక్షిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు >>2

# ఏపి సీడ్స్‌ను తిరిగి గాడిన పెడుతున్నాం



## వ్యవసాయమంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,అక్టోబరు1,ప్రశాతవార్తప్రతినిధి:** ఏపీ సీడ్స్ సంస్థను తిరిగి గాడిలో పెడుతోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరిస్తూ, ప్రస్తుత విత్తన సరఫరా బిల్లులను చెల్లిస్తూ ఏపీ సీడ్స్ సంస్థను తిరిగి గాడిలో పెడుతోందని మంత్రి తెలిపారు. విత్తనాలపై ఆరోపణలు చేసే ముందు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు 2018-19లో 50 శాతంగా ఉన్న సెనగ విత్తనాల సబ్సిడీని వైసీపీ పాలనలో 2020-21లో 30 శాతానికి, 2021-22లో 25 శాతానికి ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దానిని తిరిగి 35 శాతానికి పెంచిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీని 50 శాతం నుంచి 75 శాతానికి పెంచితే, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి 50 శాతానికి ఎందుకు తగ్గించిందో జగన్ సమాధానం చెప్పాలన్నారు. 2014-19 మధ్య ఏటా సగటున 3.20 లక్షల క్వింటాళ్ల సెనగ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందిస్తే, 2019-24 మధ్య ఆ సగటు 1.55 లక్షల క్వింటాళ్లకు ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2026-27లో సబ్సిడీపై సెనగ విత్తనాల సరఫరాను 1.50 లక్షల క్వింటాళ్ల నుంచి 2.50 లక్షల క్వింటాళ్లకు పెంచుతోందన్నారు. గతంలో రూ.29 కోట్లుగా ఉన్న సెనగ విత్తనాల సబ్సిడీ నిధులను ఈ ఏడాది రూ.78.75 కోట్లకు పెంచామని, సబ్సిడీ శాతంతో పాటు రైతులకు అందించే విత్తనాల పరిమాణాన్ని కూడా పెంచుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. 2019 నుంచి 2023 మధ్య విత్తన సబ్సిడీకి సంబంధించిన సుమారు రూ.477 కోట్లను ఏపీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు చెల్లించకుండా ఎందుకు పెండింగ్‌లో పెట్టారో జగన్ చెప్పాలని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. సాధారణంగా విత్తన సబ్సిడీ కోసం రూ.240 కోట్లు కేటాయిస్తుండగా, ఈ ఏడాది అదనంగా రూ.109 కోట్లు సమకూర్చి మొత్తం సుమారు రూ.348 కోట్ల నిధులను అందుబాటులో ఉంచామని తెలిపారు. కంటింజెన్సీ ప్రణాళిక కింద మినుములు, >>2



# నేతన్నల సేవలో.. త్వరలో రెండో విడత

## మంత్రి సవిత

**అమరావతి, అక్టోబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** రెండో విడత నేతన్నల సేవలో పథకం కింద ఆర్థికసాయం అందించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ చురుగ్గా సాగుతున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు ఏడో తేదీ నుంచి నేతన్నల సేవలో పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. మొదటి విడతలో 71,536 మందికి రూ.25వేల చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. రెండో విడ తలో ఆర్థిక సాయం అందించడానికి లబ్ధి దారుల నుంచి దరఖాస్తులు స్వీకరించా మ న్నారు. రాష్ట్రవ్యాప్తంగా 36,632 దరఖాస్తు >>2



సీతారాంపురంలో లబ్ధిదారులతో మంత్రి కొల్లు రవీంద్ర

# దశాబ్దాల సమస్యలకు ఇప్పుడే సరైన పరిష్కారం

## పల్లెపండుగ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం నియోజకవర్గం ప్రగతి పథంలో నడుస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు పల్లె పండుగ 3.0కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం రూరల్ మండలం లోని సీతారాంపురంలో మంత్రి పర్యటించారు. వృద్ధులు, దివ్యాంగులకు పెన్షను >>2

# హాస్టళ్ల డైట్ ఛార్జీలు పెంపు

**అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో వసతి పొందుతున్న విద్యార్థుల డైట్ ఛార్జీలు పెరిగాయి. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం నెలవారీ ఆహార ఛార్జీలను 10 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. సాంఘిక సంక్షేమ శాఖ జారీ చేసిన జీవో ఎంఎస్ నం.18, తేదీ 01102026 ప్రకారం పెంచిన ధరలు 2026-27 విద్యా సంవత్సరం నుంచి, అంటే అక్టోబర్ 1, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. అనంతపురం జిల్లాలో ఎస్సీ 50,ఎస్టీ 5, బీసీ 54 హాస్టల్స్, కేజీబీవీ32, ఏపీ మోడల్ స్కూల్స్15, ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ దాదాపు 20 పైగా ఉన్నాయి. ఇందులో మూడో తరగతి నుండి డిగ్రీ ఆపై వరకు వేలాది మంది విద్యార్థులు వసతి పొందుతూ చదువుతున్నారు. ఈ విద్యార్థులు అందరికీ డైట్ చార్జెస్ 10 శాతం పెంచుతూ ప్రభుత్వము గురువారం జీవోను విడుదల చేసింది.

| విద్యార్థులకు 10 శాతం అదనపు కేటాయింపులు |
| --- |
| 3 నుంచి 6వ తరగతి వరకు నెలకు రూ.1,265 |
| 7 నుంచి 10వ తరగతి వరకు రూ.1,540 |
| ఇంటర్, ఆపై తరగతుల వారికి రూ.1,760 |

**తరగతుల వారీగా కొత్త ధరలు:** ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 3 నుంచి 6వ తరగతి విద్యార్థులకు ప్రస్తుతం నెలకు చెల్లిస్తున్న రూ.1,150 డైట్ ఛార్జీని రూ.1,265కు పెంచారు. 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉన్న రూ.1,400ను రూ.1,540కు, ఇంటర్మీడియట్ ఆపై తరగతుల విద్యార్థులకు ఉన్న రూ.1,600ను రూ.1,760కు పెంచారు. అన్ని కేటగిరీల్లోనూ పాత ధరపై 10 శాతం పెంపు అమలు కానుంది.

**ఏయే సంస్థలకు వర్తిస్తుందంటే?:** సాంఘిక సంక్షేమం, బీసీ సంక్షేమం, గిరిజన సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం, జువెనైల్ సంక్షేమం, పాఠశాల విద్యాశాఖల పరిధిలోని హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, హోమ్స్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ స్కూళ్లలోని విద్యార్థులకు ఈ పెంపు వర్తించనుంది. ఆయా శాఖల పరిధిలోని విద్యాసంస్థల్లో చదువుతూ వసతి పొందుతున్న విద్యార్థులకు మెరుగైన, పోషక విలువలున్న ఆహారం అందించడమే ఈ నిర్ణయం లక్ష్యంగా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

**మెనూ, పరిమాణాలపైనా స్పష్టత:** పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా విద్యార్థులకు అందించే ఆహార మెనూను, ప్రతి విద్యార్థికి రోజువారీగా అందించాల్సిన ఆహార పదార్థాల పరిమాణాలను అనుబంధాల్లో ప్రభుత్వం నిర్దేశించింది. ప్రీమెట్రిక్ హాస్టళ్లకు ఒక మెనూ, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు మరో మెనూను పొందుపరిచింది. అనుబంధాల్లో పేర్కొన్న వివరాల ప్రకారం విద్యార్థులకు రోజువారీ ఆహారంతోపాటు పాలు, అల్పాహారం, చిరుతిళ్లు, పండ్లు వంటి పదార్థాలను అందించే విధానం ఉంది. గుడ్లు, చికెన్ పంపిణీకి కూడా వారంలో నిర్దిష్ట >>2

02-10Pg7exHMNWJQET.qxd OK:02-10Pg7exHMNWJQET.qxd 1/1/02 8:36 AM Page 1



# 12 ప్రభుత్వ ఆసుపత్రులకు రాష్ట్ర స్థాయి స్వచ్ఛ అవార్డులు

**● పరిశుభ్రత, ఇన్‌ఫెక్షన్ నియంత్రణ, మరో మూడు అంశాల ప్రాతిపదికన ఎంపిక ● అధికారులకు మంత్రి సత్య కుమార్ యాదవ్**

**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని 12 ప్రభుత్వ ఆసుపత్రులకు స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డులు-2026 లభించాయి. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు సంబంధించిన అంశాలపై నిర్వహించిన పరిశీలనలో వీటిని ఎంపిక చేశారు. జిల్లాల నుంచి వచ్చిన స్వీయ ప్రతిపాదనల (సెల్ఫ్ అసెస్ మెంట్) ఆధారంగా స్వచ్ఛ ఆంధ్ర అధికారులు తృతీయ పక్షం ద్వారా ఆయా ఆసుపత్రులను క్షేత్రస్థాయిలో నేరుగా పరిశీలన చేయించారు. చివరికి 12 ఆసుపత్రుల్ని అవార్డులకు ఎంపిక చేశారు. వీటికి సంబంధించిన అధికారులకు శుక్రవారంనాడు అవార్డులను సీఎం చంద్రబాబు అందజేయనున్నారు. ఆసుపత్రులకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు అందించేందుకు 5 అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఉపయోగపడే మరుగుదొడ్ల నిర్వహణకు 30 శాతం, చేతుల పరిశుభ్రతకు అవసరమైన సదుపాయాలకు 25 శాతం, మరుగుదొడ్ల పరిశుభ్రత, నిబంధనల అమలుకు 20 శాతం, ఇన్‌ఫెక్షన్ల నియంత్రణకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించేందుకు 15 శాతం, పరిశుభ్రతపై స్పష్టమైన సూచనలు, సందేశాల ప్రదర్శనకు 10 శాతం ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ఐదు అంశాల ఆధారంగా పరిశీలన చేపట్టి వచ్చిన మార్కుల ప్రాతిపదికన ఆసుపత్రులను ఎంపిక చేశారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు ఎంపికైన 12 ప్రభుత్వ ఆసుపత్రుల్లో కృష్ణా జిల్లాలోని కనుమోలు, ఎన్టీఆర్ జిల్లాలోని కొణకంచి, అనకాపల్లిలోని ప్రభుత్వ ఆయుష్ వైద్యశాలలు ఉన్నాయి. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట, విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఎంపికయ్యాయి. కర్నూలు జిల్లాలోని ఆస్పరి, మార్కాపురం జిల్లాలోని కొణకనమిట్ల, ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. మంగళగిరిలోని ఇందిరానగర్, తిరుపతిలోని ప్రకాశం రోడ్డు, విశాఖపట్నం జిల్లాలోని చినముషిడివాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సైతం స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు అందుకోనున్నాయి. స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవం అక్టోబర్ 2న విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన 12 ప్రభుత్వ ఆసుపత్రులకు స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్రస్థాయి అవార్డులు అందజేయనున్నారు. మరోవైపు.. జిల్లాల స్థాయిలోనూ సదరు జిల్లా కలెక్టర్ ద్వారా స్థానికంగా ఎంపిక చేసిన ఆసుపత్రులకు అవార్డుల ప్రదానం జరగనుంది.

# వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ వచ్చేసింది!

**● 2027అక్టోబరు 2 నుంచి నవంబరు 21వరకు టోర్నమెంట్ ● దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికగా మ్యాచ్‌లు ● 14 జట్లు, మూడు దశలు... 57 మ్యాచ్‌లు ● గ్రూప్-ఎలో భారత్, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, జింబాబ్వే ● నవంబరు 21న జొహన్నెస్‌బర్గ్ వేదికగా ఫైనల్ పోరు**




**కేప్ టౌన్, అక్టోబరు 1:** యావత్ ప్రపంచంలో క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 2027 వరల్డ్ కప్ షెడ్యూల్ రానే వచ్చేసింది. సౌతాఫ్రికా, నమీబియా, జింబాబ్వే వేదికగా జరగనున్న ఈ మెగా టోర్నమెంట్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) గురువారం అధికారికంగా ప్రకటించింది. దీంతో వరల్డ్‌కప్ కౌంట్‌డౌన్ మొదలైంది. వచ్చే యేడాది అక్టోబరు 2 నుంచి నవంబరు 21 దాకా టోర్నీ జరగనుంది.
వచ్చే యేడాది జరగనున్న ఐసిసి పురుషుల వన్డే ప్రపంచ కప్ కోసం చిరకాల ప్రత్యర్థులైన భారత్, పాకిస్థాన్‌లను, ప్రస్తుత ఛాంపియన్ ఆస్ట్రేలియాతో పాటు 'గ్రూప్-ఎ'లో చేర్చినట్లు ఐసిసి ప్రకటించింది. 14 జట్లతో కూడిన ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ కోసం గ్రూపుల విభజనను కేప్ టౌన్‌లోని జైట్జ్ మ్యూజియం ఆఫ్ కాంటెంపరరీ ఆర్ట్ ఆఫ్రికా (జైట్జ్ మోకా)లో నిర్వహించిన ఒక అట్టహాసమైన షెడ్యూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధికారికంగా వెల్లడించారు. గ్రూప్-ఎలో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్, సహ ఆతిథ్య దేశం జింబాబ్వే, క్వాలిఫయర్-ఎగా నిలిచిన జట్టుతో కూడిన బలమైన జట్ల వరుస ఉంది. మరోవైపు, గ్రూప్-బిలో సహఆతిథ్య దేశం దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, క్వాలిఫయర్-బి ఉన్నాయి. భారత్, పాకిస్థాన్‌లను ఒకే గ్రూప్‌లో చేర్చడం వల్ల ఈ రెండు పొరుగు దేశాల మధ్య గ్రూప్ దశలో హోరాహోరీ పోరు ఖాయమైంది. ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో భారత్ అగ్రస్థానంలో ఉండగా, ఈ మెగా ఈవెంట్‌లో శుభ్‌మన్ గిల్ తొలిసారిగా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 2027 ఐసిసి పురుషుల క్రికెట్ ప్రపంచ కప్ అక్టోబరు 2న ప్రారంభం కాగా, ఫైనల్ నవంబరు 21న జరగనుంది. 24యేళ్ల విరామం తర్వాత ఈ ప్రతిష్టాత్మక 50 ఓవర్ల టోర్నమెంట్ ఆఫ్రికా గడ్డపైకి తిరిగి రావడం కూడా దీనితోనే మొదలవుతుంది. ఈ టోర్నమెంట్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. 14 జట్లు పాల్గొనే ఈ పోటీలో 57 మ్యాచ్‌లు 12 వేదికలలో జరగనున్నాయి. ఆఫ్రికా చివరిసారిగా 2003లో ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇచ్చింది. అప్పుడు జరిగిన ఎనిమిదో ఎడిషన్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, కెన్యా దేశాలు సహఆతిథ్య దేశాలుగా వ్యవహరించాయి. తమ ఐసిసి ర్యాంకింగ్‌లు, హోదా ఆధారంగా ఇప్పటికే పది జట్లు నేరుగా అర్హత సాధించాయి. వీటిలో ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వేలతో పాటు భారత్, డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ ఉన్నాయి.

**ఫార్మాట్ ఇలా:** ఈ టోర్నమెంట్‌లో 14 జట్లు పోటీ పడనున్నాయి. అయితే ఈసారి టోర్నీ ఫార్మాట్ మార్చారు. ఇందులో 10 జట్లు ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా టోర్నీకి క్వాలిఫై అయ్యాయి. మిగిలిన నాలుగు టీమ్స్ క్వాలిఫికేషన్ ద్వారా ఎంపిక అవుతాయి. అలా 14 జట్లతో మూడు రౌండ్లలో టోర్నీ ఉండనుంది. రౌండ్-1లో 14 జట్లలో చివరి మూడు స్థానాల్లో నిలిచిన టీమ్స్ 'రౌండ్ రాబిన్ సూపర్ సిరీస్‌లో తలపడతాయి. ఇందులో అత్యుత్తమంగా ఆడిన ఒక జట్టు మాత్రమే మెయిన్ టోర్నీకి వెళ్తుంది. మిగిలిన రెండు జట్లు నిష్క్రమిస్తాయి. దీంతో 12 జట్లతో మెయిన్ టోర్నమెంట్ షురూ అవుతుంది.
12జట్లను రౌండ్-2లో రెండు గ్రూపులుగా విభజించి ఆడిస్తారు. ఒక్కో గ్రూపులో ఆరేసి జట్లు ఉంటాయి. ఆయా గ్రూపుల్లోని టీమ్స్ రౌండ్ రాబిన్ మోడల్‌లో మిగిలిన జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడతాయి. ప్రతి గ్రూప్‌లో టాప్-3లో నిలిచిన జట్లు తర్వాతి రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. అలాగే రెండు గ్రూపుల్లో కలిపి అత్యుత్తమంగా ఆడి నాలుగో స్థానంలో ఉన్న జట్టుకు కూడా అవకాశం ఉంటుంది. ఈ ఏడు జట్లు సూపర్-7 రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. ఈ సూపర్-7లో ఏడు జట్లు కూడా ఒకే గ్రూప్‌లో ఉంటాయి. ఇందులోనూ రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. టాప్-4లో నిలిచిన నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. 1వ, 4వ స్థానాల్లో నిలిచిన జట్లు తొలి సెమీస్, 2వ, 3వ స్థానాల్లో ఉన్న జట్లు రెండో సెమీస్‌లో ఢీకొంటాయి. ఇందులో నెగ్గిన రెండు టీమ్స్ ఫైనల్స్‌కు వెళ్తాయి.

## అక్టోబరు 10న దాయాదుల పోరు.. షెడ్యూల్ పక్కా!

**ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఆసక్తిగా చూసే భారత్ - పాకిస్థాన్ మ్యాచ్‌కు ముహూర్తం ఖరారైంది. టోర్నీ ప్రారంభమైన మూడు రోజులకే, అంటే అక్టోబరు 10న చిరకాల ప్రత్యర్థుల సమరం జరగనుంది. రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో సాగే గ్రూప్ దశలో భారత్ మొత్తం ఐదు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది:**

**అక్టోబర్ 7: భారత్ - ఆస్ట్రేలియా (కేప్‌టౌన్),**
**అక్టోబరు 10: భారత్ -పాకిస్థాన్,**
**అక్టోబరు 14: భారత్ - అఫ్ఘానిస్థాన్,**
**అక్టోబరు 17: భారత్ - క్వాలిఫయర్ 'ఏ, అక్టోబరు 24: భారత్ - జింబాబ్వే**

# పన్నుల రాబడిలో వాణిజ్యపన్నుల శాఖ అరుదైన ఘనత

**● వాణిజ్య పన్నుల వసూళ్లలో ఏపీకి భారీ ఆదాయం**

**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల ద్వారా రూ. 30,435.98 కోట్ల ఆదాయం సాధించింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 18 శాతం వృద్ధితో పాటు రూ. 4,543.06 కోట్ల అదనపు ఆదాయం కావడం విశేషం. కేవలం సెప్టెంబర్ నెలలోనే రూ. 3,182.87 కోట్ల నికర జీఎస్టీ వసూలైంది. దక్షిణాది రాష్ట్రాల జీఎస్టీ వృద్ధి రేటులో తమిళనాడు తర్వాతి స్థానంలో ఏపీ నిలిచింది. ఈ ఏడాది తొలి ఆర్థిక అర్థ సంవత్సరంలో 18 శాతం వృద్ధి నమోదు...గతేడాది తొలి అర్థ సంవత్సరంలో వసూలైన పన్నులు రూ.25,892.92 కోట్లు..
ఈ ఏడాది తొలి అర్థ సంవత్సరంలో రూ.30,435.98 కోట్ల రాబడి సాధించిన రాష్ట్రం..గతేడాది కంటే ఈ అర్థ సంవత్సరం రూ.4,543.06 కోట్ల అధనపు ఆదాయం సాధించిన ఏపీ వాణిజ్య పన్నుల శాఖ..గతేడాది సెప్టెంబరు, ఈ ఏడాది సెప్టెంబరు మాసాలతో పోల్చినా రికార్డు స్థాయిలో పెరిగిన ఆదాయం..గతేడాది సెప్టెంబరులో 4,334.84 కోట్లు ఆదాయం వస్తే ఈ సెప్టెంబరులో 4,986.18 కోట్ల రాబడి.. కంటే ఈ సెప్టెంబరులో రూ.651.34 కోట్ల రాబడితో 15.03 శాతం వృద్ధి నమోదు ఏడాది సెప్టెంబరులో నిఖర జీఎస్టీ వసూళ్లలోనూ ..14.10..శాతం వృద్ధి నమోదు..పెట్రోలియంపై వ్యాట్ ద్వారా కూడా సెప్టెంబరులో 20.77 శాతం వృద్ధితో రూ.1,666.91 కోట్ల రాబడి.. ఐజీఎస్టీ సెటిల్‌మ్మెంట్లలోనూ రూ.1,927.62 కోట్ల ఆదాయంతో 20.12 శాతం వృద్ధి నమోదు చేసుకున్నామని ఆంధ్రప్రదేశ్ వాణిజ్యపన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు ఏ. వెల్లడించారు

# పొర్లుకట్టలో పండుగలా పెన్షన్ల పంపిణీ

**● అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్ అందించిన మంత్రి నారాయణ**



**నెల్లూరు, అక్టోబరు 1, ప్రభాతవార్త - కలెక్టరేట్:** నెల్లూరు సిటీ నియోజకవర్గం పొర్లుకట్టలో గురు వారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదును అందించారు. మంత్రే తమ ఇంటికి వచ్చి పెన్షన్ అందించడంతో అవ్వాతాతలు, వృద్ధులు, మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబరు నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 61,80,448 మంది లబ్ధిదారులకు రూ. 2,692 కోట్లతో పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పెన్షన్ల కోసం రూ.76 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఏడాదికి సుమారు రూ.33 వేల కోట్లు సామాజిక భద్రతా పెన్షన్ల కోసం ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు బాధ్యతతో ముందుకు సాగుతున్నారని మంత్రి తెలిపారు. సామాజిక పెన్షన్ల పంపిణీ సందర్భంగా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు.గత ప్రభుత్వంపెన్షన్ల పెంపులో వాయిదా పద్ధతిని అవలంబించిందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒకేసారి పెన్షన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచిందన్నారు. మూడు నెలల పెంపు మొత్తాన్ని కూడా కలిపి అందిస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేశారని చెప్పారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బలహీన వర్గాలకు పెన్షన్లను ఒకే సారి పెంచి వారి జీవితాల్లో భరోసా కల్పించామని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్లను రూ.6 వేలకు, పూర్తి వికలాంగుల పెన్షన్లను రూ.15 వేలకు, కిడ్నీ, కాలేయం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.10 వేలుగా పెంచి అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక భద్రతా పెన్షన్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.సచివాలయంలో ఆకస్మిక తనిఖీ పెన్షన్ల పంపిణీ అనంతరం మంత్రి నారాయణ 48వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించి ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా అందేలా పనిచేయాలని సూచించారు. అనంతరం స్థానిక పాఠశాల అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు, అభివృద్ధి పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాత, డీఈఓ బాలాజీరావు, ఎంఈఓ తిరుపాల్, కార్పొరేషన్ ఎస్ఈ జానీ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్ రామకృష్ణ, డివిజన్ టీడీపీ నాయకులు ధర్మవరపు సుబ్బారావు, ఇంతియాజ్, పెంచలబాబు, జాఫర్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సేవా జ్యోతి యాత్ర

**● బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**



**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా సేవా జ్యోతి యాత్ర ప్రారంభమవుతుందని అక్టోబర్ 7 నుంచి భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ యాత్ర కొనసాగుతుందని, ప్రతి గ్రామంలో ప్రజలు భాగస్వాములు అయ్యేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అక్టోబర్ 17న రాష్ట్రవ్యాప్తంగా ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అందించిన సహకారాన్ని ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి కేంద్రం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. పోలవరం పనులు పూర్తవుతున్న నేపథ్యంలో అక్కడి అభివృద్ధి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా ప్రజలకు చూపించే కార్యక్రమం చేపడతామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ పదాధికారుల సమావేశం విజయవాడలో రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన జరిగింది. ఏపీ బీజేపీ ఇన్‌చార్జి అరవింద్ బదౌరియా, సహ ఇన్‌చార్జి వనతి శ్రీనివాసన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, దగ్గుబాటి పురంధేశ్వరి, సీఎం రమేష్, సుజనా చౌదరి, విష్ణుకుమార్ రాజు, రామకృష్ణారెడ్డి, సోము వీర్రాజు, సునీతతో పాటు పలువురు బీజేపీ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 600కు పైగా రక్తదాన శిబిరాలు, ఆయుష్ వైద్య శిబిరాలు నిర్వహించినట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో "ఆంగన్‌కి ఉత్సవ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పాఠశాలల్లో చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తిరుపతి నుంచి వారణాసి వరకు "సేవా సంకల్ప యాత్రను ప్రారంభించినట్లు చెప్పారు. యువత ఆధ్వర్యంలో బైక్‌లపై ఈ యాత్ర కొనసాగుతోందని, ప్రధాని మోదీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. విశాఖపట్నం రైల్వే జోన్, జాతీయ రహదారుల నిర్మాణం, అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టిన నిర్మాణాలు, పర్యాటక అభివృద్ధి కోసం జరుగుతున్న పనులను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమన్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తావిస్తున్న ఓట్ చోర్టీ అంశంపై కూడా మాధవ్ స్పందించారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో సమాధానం ఇచ్చారని చెప్పారు. ఎవరెన్ని రాజకీయ విమర్శలు చేసినా ప్రజలు మోదీ పాలనపై నమ్మకంతో ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ప్రజలు కూటమికి అండగా నిలిచారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రజల మద్దతు ఉంటుందని అన్నారు.

# ఆనంతో విభేదాలు సృష్టించేందుకు వైసిపి కుట్రలు

**● వైసిపి చిల్లర రాజకీయాలపై విరుచుకుపడ్డ మంత్రి నారాయణ**



**నెల్లూరు, అక్టోబర్ 1, ప్రభాతవార్త - వైద్యం :** విఆర్‌సి పాఠశాల వివాదాన్ని సాకుగా చూపి తనకూ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని మంత్రి నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై ఇప్పటికే విద్యాశాఖ మంత్రితో స్పష్టంగా మాటాడానని, మంత్రి ఆనంతో తనకు చాలా సత్సంబంధాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు తమ మధ్య గొడవలు పెట్టాలని ఎంత రెచ్చగొట్టినా తాను రెచ్చిపోయేది లేదని, అనవసర వివాదాలకు ప్రాధాన్యమివ్వకుండా అభివృద్ధి సంక్షేమ పనులతోనే వైసీపీ సవాళ్లకు సమాధానం చెప్తానని తేల్చిచెప్పారు. సిఎస్ఆర్ నిధులతో చెట్లు నాటే మంచి కార్యక్రమాలపై కూడా వైసీపీ నీచమైన రాజకీయాలు చేయడం విచారకరమన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే వారికి మరోసారి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. నెల్లూరు నగర పరిధిలోని 42, 48, 49 వార్డుల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను మంత్రి నారాయణ సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ నగరంలోని అన్ని పాఠశాలలను దశలవారీగా అంతర్జాతీయ స్థాయిలో ఆధునీకరిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాల (గుంట బడి) మోడల్ స్కూల్‌ను నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నెల్లూరులోనే అత్యుత్తమ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు టీవీఎస్, సంస్థ సిఎస్ఆర్ కింద 6.5 కోట్లు కేటాయించగా, ఇప్పటికే 2 కోట్లు విడుదలయ్యాయని వెల్లడించారు. ఈ మోడల్ స్కూల్ నిర్మాణ బాధ్యతలను ప్రముఖ ఎన్‌సీసీ సంస్థకు అప్పగించామని, వార్షిక పరీక్షల అనంతరం వచ్చే రెండు నెలల వేసవి సెలవుల్లో పనులను వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. పేదరిక నిర్మూలనకు నాణ్యమైన విద్యే ఏకైక మార్గమన్నారు. పాఠశాలల్లో సైన్స్, కంప్యూటర్, రోబోటిక్స్ ల్యాబ్‌లతో పాటు ఆర్ట్, పెయింటింగ్, లైబ్రరీ వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు 20 కోట్లతో టిట్కో స్కూల్ అభివృద్ధి టెండర్లు పూర్తయ్యాయని, 2027 జూన్ 12 నాటికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ/కెనాల్ టెక్నాలజీ ద్వారా నెల్లూరును దోమల రహిత నగరంగా తీర్చిదిద్ది ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

## మహిళ దారుణ హత్య

**క్యారంపూడి, అక్టోబర్ 1 ప్రభాతవార్త :** పట్టణంలోని వినుకొండ రోడ్ లో పెద్ద మసీదు ప్రాంతంలో నివాసం ఉంటున్న రామావుత . లక్ష్మీ మ్రబాయి (35) గురువారం దారుణ హ త్యకు గురైంది . బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై వాసు , సీఐ భాస్కర్ సంఘటన స్థ లానికి వెళ్లి పరిశీలించారు . మృతురాలి సొంత మరిది బంగారాన్ని తాకట్టు పెట్టుకుని విడిపించకపోవడంతో వివాదం చోటు చేసుకుంది . వివాదం చెలరేగి హత్యకు దారి తీసింది . మృతురాలు లక్ష్మీ మ్రబాయి తన బం గారం కావాలని మరిది బాబా నాయక్ ను అడగడంతో హత్య జరిగినట్లు సమా చారం. లక్ష్మీ మ్రబాయి తన భర్త కి ఫోన్ చేసి గొడవ జరుగుతున్నట్లు చెప్పినట్లు సమా చారం. ఇంటికి వచ్చి చూసిన లక్ష్మీ మ్రబాయి భర్త ఆంజనేయులు నాయక్ అనుమానంతో తాళం పగలగొట్టి చూడగా లక్ష్మీ మ్రబాయి ఉరి వేసుకుని వేలాడుతున్నట్లు పోలీసులకు తెలి పారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఒప్పిచర్ల గ్రామంలో లక్ష్మి మ్ర అనే మహిళపై దారుణ హింసలు చేసి హత్య చేసిన సంఘటనలో బాబా నాయక్ ఉన్నట్లు తెలుస్తుంది.

## బైకును కారు ఢీకొని ఇద్దరు మృతి

**కలువాయి (నెల్లూరు), అక్టోబర్ 1, ప్రభాతవార్త :** కారు మోటార్ బైకు ఢీకున్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటరామరాజుపేట హైవే నందు చోటు చేసుకుంది. అనంతసాగరం మండలం పాత దేవరాయపల్లి చెందిన షేక్ రసూల్‌బాషా, మణికల సుధాకర్లు చింతళ పాళెం గ్రామంలో గురువారం పెయింటింగ్ పనులు ముగించుకొని తిరిగి గ్రామానికి వెళ్ళే క్రమంలో ఏలూరు నుండి పెంచలకోనకు వెళుతున్న కారు ఢీకొనడంతో ఈ ఘటనలో రసూల్‌భాషా, సుధాకర్లు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన వారిని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని రాపూరు సిఐ శ్రీనివాసరావు కలువాయి ఎస్ఐ కోటయ్యలు సమీక్షించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**కావలి (నెల్లూరు), అక్టోబర్ 1, ప్రభాతవార్త :** అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన కావలి పట్టణంలో తీవ్ర సంచలనంగా మారింది.స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాలు మేరకు,కావలి పట్టణంలోని తుఫాన్ నగర్ కు చెందిన పొంగులూరి విజయలక్ష్మి(68) తన ఇంటిలో ఒంటరిగా ఉంటుందని తెలియజేశారు. గురువారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించి బీరువాని పగలగొట్టి విజయలక్ష్మిని హత్య చేసి వంటి మీద ఉన్న సుమారు 20 సవర్ల బంగారు ఆభరణాలతో పరారు కావడం జరిగిందని తెలియజేశారు.ఇటీవల కూడా రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ చేయబోయిన దుండగులు అయి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.క్లూస్ టీం ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించడం జరిగింది. కావలి రెండవ పట్టణ పోలీసులు కూడా పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దసరా సందర్భంగా పలు టెండర్లు ఆమోదం

**- దసరా ఏర్పాట్లు పరిశీలించిన సిపి**

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో 2026 సంవత్సరంలో అక్టోబర్ 11 నుండి జరగబోయే దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించాల్సిన ఏర్పాట్లకు సంబంధించిన పలు టెండర్లను గురువారం జరిగిన పాలకమండలి సమావేశంలో ఆమోదించారు. ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు వివరాలను వెల్లడించారు. ముఖ్యంగా దసరాల్లో నిర్వహించే అర్చక సభలో పాల్గొనే అర్చకుల సంఖ్యను పెంపు, రు.1000లతో దసరాల్లో దుర్గమ్మవారి దర్శనానికి విఐపి దర్శన టికెట్, సిసి టివి ఏర్పాట్లు, దసరా ఉత్సవాల్లో దుర్గమ్మవారి ప్రసాదాలను తంతితపాల శాఖ పోస్టు ద్వారా భక్తులకు పంపటానికి, ముఖ్యంగా దుర్గమ్మవారి దేవస్థానం ప్రాముఖ్యతను వివరించేలా పోస్టల్ స్టాంప్ విడుదలకు అనుమతి కోరుతూ



కలెక్టర్ లక్ష్మిషాకు దసరా ఉత్సవాలకు ఆహ్వానం

సమర్పించిన ప్రతిపాదన తదితర ముఖ్యమైన నిర్ణయాలకు పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, బడేటి ధర్మారావు, పి. రాఘవరాజు, టి. హరికృష్ణ, ఎం. కళావతి, పద్మావతి ఠాకూర్, ఎస్. సరిత, పార్వతి, సుబ్రహ్మణ్యకుమార్, ప్రత్యేక ఆహ్వానితులు వి. శంకరబాబు పాల్గొన్నారు.

**- దసరా ఏర్పాట్లు పరిశీలించిన సిపి:**
గురువారం నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఇంద్రకీలాద్రిపై ఏర్పాటవుతున్న క్యూ లైన్లు, దర్శనం మార్గాలు తదితరములు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ దుర్గారావు, వన్ టౌన్ సిఐ గుణ రామ్, దేవస్థానం ఇఇ రమ తదితరులు పాల్గొన్నారు.

**- ఎంపి, కలెక్టర్, సిపిలకు దసరా ఆహ్వానం:**
దుర్గమ్మవారి ఆలయంలో జరగబోయే దసరా ఉత్సవాల ఆహ్వానపత్రికను గురువారం విజయవాడ ఎంపి కేశినేని



సిపికి దసరా ఉత్సవాల ఆహ్వానం

శివనాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మిశ, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబుకి ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ తదితరులు దసరా ఉత్సవాల ఆహ్వానపత్రికను అందజేశారు.

# సిఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా 5 ప్రాంతీయ సదస్సులు : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

- అక్టోబర్ 7 నుంచి 26 వరకు ప్రత్యేక ఎంఎస్‌ఎంఇ ఎగ్జిబిషన్లు - విశాఖపట్నం, కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలో సదస్సులు- స్థానిక చిన్న తరహా పరిశ్రమలకు మార్కెట్ అవకాశాలు కల్పించేలా వెండర్ డెవలప్‌మెంట్ - బయ్యర్‌సెల్లర్ సమావేశాలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఇంటికో పారిశ్రామికవేత్త లక్ష్యం



**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాత వార్తప్రతినిధి:** విశాఖపట్నంలో నవంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026కు సన్నాహకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రాంతీయ సదస్సులు నిర్వహించ నున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా ప్రాంతీయ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం, సమతుల్య అభివృద్ధి సాధించడం, స్థానిక ఎంఎస్‌ఎంఇలను పారిశ్రామిక ప్రగతిలో భాగస్వాములను చేయడమే ఈ సదస్సుల ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంటికో పారిశ్రామికవేత్త ఆలోచనకు అను గుణంగా ఈ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సదస్సులు స్థానిక ఎంఎస్‌ఎంఈలకు భారీ పరిశ్రమలకు, ప్రభుత్వ రంగ సంస్థలకు మధ్య ఒక వారధిగా పని చేస్తాయన్నారు. ఈ సదస్సులతో యువకులు, మహిళలు, చిన్న పరిశ్ర మలకు కొత్త అవకాశాలు లభిస్తాయని మంత్రి వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన విశాఖపట్నం, 12న కాకినాడ, 16న గుంటూరు, 23న అనంతపురం, 26న తిరు పతిలో ఈ సదస్సులు జరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రతి సదస్సులో ఎంఎస్‌ఎంఇ ఎగ్జిబిషన్, బయ్యర్‌సెల్లర్ సమావేశాలు, ఎంఎస్‌ఎంఇ పాలసీ 4.0 రాయితీలు, రుణాలు, ప్రభుత్వ కొనుగోళ్లపై అవగాహన కార్యక్రమాలు ఉంటా యన్నారు. యువత, మహిళలు, విద్యార్థులకు వ్యాపారాల స్థాపన, బ్యాంకు రుణాలు మరియు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ద్వారా ఇన్క్యుబేషన్ మద్దతు అందిస్తారని మంత్రి తెలిపారు. విశాఖపట్నంలో టెక్నాలజీ డీప్‌టెక్, తిరు పతిలో ఎలక్ట్రానిక్స్, అనంతపురంలో గ్రీన్ ఎనర్జీ భారీ పరిశ్రమలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సంస్కరణలతో పాటు ఆన్‌లైన్ అనుమతుల కోసం తీసుకొచ్చిన సింగిల్ డెస్క్‌వ్యవస్థను ఈ సదస్సులలో ప్రదర్శిస్తారు. రాష్ట్రంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులు, నిర్వాహకులు ప్రాంతీయ సదస్సులకు హాజరై అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# అరకు కాఫీ గిరిజన సంస్కృతికి ప్రతీక

**అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా డి.సిఎం పవన్ శుభాకాంక్షలు**




అరకు కాఫీ బ్రాండ్ అంబాసిడర్‌గా డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాత వార్తప్రతినిధి:** అరకు కాఫీని మన ప్రాంతానికి సంబం ధించిన ఒక మధురమైన జ్ఞాపకంగానూ, గిరిజన వర్గాల కఠోర శ్రమకు నిదర్శనంగానూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివర్ణించారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్రానికి గర్వకారణమైన అరకు కాఫీ విశిష్టతను కొనియాడారు. అదేవిధంగా దానిని పండించే గిరిజన రైతుల శ్రమను గుర్తిస్తూ ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. గిరిజన రైతుల కఠోర శ్రమ తత్వం అరకు కాఫీలోని ప్రతి కప్పులోనూ ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. పార్లమెంటు ప్రాంగణం వరకు చేరుకుని అరకు కాఫీ తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకుందని ఆయన గుర్తుచేశారు. అరకు కాఫీ ప్రత్యేకతను ప్రధాన మంత్రి మోదీ కూడా పలు సందర్భాల్లో ప్రశంసించారని ఆయన ప్రస్తావించారు. అరకు కాఫీని ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు విస్తరించేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే తూర్పు కనుమలను పరిరక్షించాలని, ఈ కాఫీని పండించే గిరిజన రైతుల సంక్షేమాన్ని కాపాడాలని పవన్ కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గిరిజన వర్గాల జీవితాలను కాఫీ సాగు పూర్తిగా మార్చేసింది. ఒకప్పుడు పేదరికంలో జీవించిన వీరు, ఇప్పుడు అంతర్జాతీయ గుర్తింపు పొందిన కాఫీని పండిస్తున్నారు. ఎటువంటి రసాయనాలను ఉపయోగించకుండా సేంద్రీయ పద్ధతిలో ఈ పంటను సాగు చేస్తున్నారు. వీరి కృషికి గుర్తింపుగా వీరికి సేంద్రీయ ధృవీకరణ పత్రాలు, అనేక అవార్డులు లభించాయి. ప్రారంభంలో కొద్దిమంది రైతులు మాత్రమే దీనిని సాగు చేయగా, ఇప్పుడు ఆ ప్రాంతంలో కాఫీ సాగు చేయని గ్రామమంటూ లేదు. చింతపల్లిలో ఒక ఖిఎకోపల్పింగ్ఖి యూనిట్ ఏర్పాటు చేయగా జి. మాడుగుల, గుడెం కొత్తవీధిలో కూడా అటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ సాగు 1985-86లోనే ప్రారంభమైంది. దీని ఫలితంగా భారతదేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఈ కాఫీకి డిమాండ్ బాగా పెరిగింది. ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఇతర ఐరోపా దేశాలకు ఎగుమతులు జరుగుతుండటంతో మార్కెట్ ధరలు పెరుగుతున్నాయి. నారా చంద్రబాబు, ప్రధాన మంత్రి మోదీ వంటి నాయకులు ప్రత్యేక సదస్సులు నిర్వహించడం ద్వారా ఈ కాఫీని చురుకుగా ప్రచారం చేస్తూ దాని ఖ్యాతిని పెంచుతున్నారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు పాడేరు మండలంలోని మోదపల్లి, గుర్రగరువు, మినుములూరు, సాంగోడి వంటి గ్రామాలలో మూడు దశల్లో కాఫీ సాగును ప్రవేశపెట్టారు. కాఫీతో పాటు అంతర పంటగా మిరియాలను కూడా సాగు చేస్తున్నారు. నేడు ఒక్కో రైతు ఏడాదికి రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. 1985- 86 కాలం నుంచి 2.51 లక్షల ఎకరాలలో 2,50,000 గిరిజన కుటుంబాలు కాఫీని సాగు చేస్తున్నాయి.

## పాఠశాల బస్సు బోల్తా! తప్పిన పెను ప్రమాదం

**ఆగిరిపల్లి, అక్టోబర్01, (ప్రభాతవార్త)** ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన ఒక ప్రైవేటు పాఠశాల బస్సు అగిరిపల్లి నుండి నూజివీడు వెళ్లే మార్గంలో వడ్లమాను గ్రామ సమీపంలో గురువారం ఉదయం వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో అదుపు తప్పి రోడ్డు మార్జిన్ దాటి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 30 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మిగిలిన విద్యార్థులను సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ద్విచక్ర వాహనంపై వస్తు గాయపడిన యువకులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసును ఎస్ఐ నాగరాజు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అరసవల్లి ఆదిత్యుని తాకని సూర్యకిరణాలు

**నిరాశతో వెనుదిరిగిన భక్తులు.. రేపైనా దర్శనమిస్తాయా?**



**శ్రీకాకుళం, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి మూలవిరాట్టును సంధ్య కిరణాలు తాకే అపురూప ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులకు నిరాశ ఎదురైంది. గురువారం సూర్యకిరణాలు ఆలయంలోకి ప్రశించినప్పటికీ స్వామివారి పాదాలను తాకకుండానే వెనుదిరిగాయి. దీంతో ఈ అద్భుత దృశ్యాన్ని చూసేందుకు వచ్చిన భక్తులు నిరుత్సాహానికి గురయ్యారు. ప్రతి ఏడాది దక్షిణాయనంలో అక్టోబరు 1. 2 తేదీల్లో, ఉత్తరాయణంలో మార్చి 9, 10 తేదీల్లో అరసవల్లి సూర్యనారాయణస్వామి మూలవిరాట్టుపై సూర్యకిరణాలు నేరుగా ప్రసరించడం ప్రత్యేకత. గోపురం మీదుగా ప్రవేశించే సూర్యకిరణాలు అనివెట్టి మండపం, ధ్వజస్తంభం మీదుగా ఆలయంలోని పంచద్వారాలను దాటి గర్భగుడిలోని స్వామివారి పాదాలను తాకుతాయి. ఈ అపురూప దృశ్యాన్ని తిలకించేందుకు గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు అరసవల్లి ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అయితే అనుకున్న సమయానికి సూర్యకిరణాలు అద్భుత మూలవిరాట్టును తాకకపోవడంతో భక్తుల్లో నిరాశ నెలకొంది. అరసవల్లి ఆదిత్యుని మూలవిరాట్టును సూర్యకిరణాలు తాకకపోవడం ఈ ఏడాది మాత్రమే కాదు. గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని ఆలయ అర్చకులు తెలిపారు. వాతావరణంలో మార్పులు, ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడం వల్ల సూర్యకిరణాలు నిర్దేశిత మార్గంలో గర్భగుడిలోకి చేరలేకపోతున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం కూడా సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తాకే అవకాశం ఉందని అర్చకులు తెలిపారు. దీంతో రేపటి సూర్యకిరణాల కోసం భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# హార్టీ కల్చర్ హబ్‌తో సీమలో కొత్త అధ్యాయం

## ఉద్యానరైతులకు అండగా ప్రతిష్టాత్మక ప్రాజెక్టు

**అమరావతి, అక్టోబరు1, ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ చరిత్రను మార్చేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టనున్న కూటమి ప్రభుత్వం..విత్తనం వేసే దగ్గర్నుంచి విదేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేసే వరకూ ఉద్యాన రైతులకు అండగా నిలిచేలా ప్రతిష్టాత్మక కార్యక్రమానికి అంకురార్పణ జరుగనున్నదని వివరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది..రూ.1 లక్షకోట్లతో మూడు దశల్లో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్ట్ పనులను చేపట్టనున్న ప్రభుత్వం..పూర్వోదయ పథకం ద్వారా రూ.40,352 కోట్ల నిధులను సమకూరుస్తోన్న ప్రభుత్వం... ప్రైవేట్ రంగం నుంచి రూ.60,000 కోట్లు పెట్టుబడులు రాబట్టేలా ప్రణాళికలు. సిద్ధం చేసారు. అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, తిరుపతి, కడప, ప్రకాశం, మార్కాపురం జిల్లాలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కింద అభివృద్ధి పనులు చేపట్టనున్న ఎన్డీఏ ప్రభుత్వం.మొత్తం 10 జిల్లాల్లోని 303 మండలాల్లోని 5,869 గ్రామాల్లో అభివృద్ధి పనులు, 201 క్లస్టర్లలో అత్యంత ప్రతిష్టాత్మకంగా హార్టికల్చర్ హబ్ ప్రాజెక్ట్ పనులను చేపట్టనున్న కూటమి సర్కార్.ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లల్లో ఉన్న హార్టికల్చర్ సాగును 6 లక్షల హెక్టార్ల మేర విస్తరించి 14.41 లక్షల హెక్టార్లకు ఉద్యాన సాగును పెంచేలా ప్రణాళికలు. ప్రస్తుతం 222 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న హార్టికల్చర్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 435 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చేలా టార్గెట్ ఫిక్స్ చేసుకున్న ప్రభుత్వం.హార్టికల్చర్ హబ్ ద్వారా సుమారు 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం.కొత్తగా 9 లక్షల ఎకరాల ఆయకట్టు... 4.3 లక్షల ఎకరాలు స్థిరీకరణ చేసేలా చర్యలు. రాయలసీమ హార్టికల్చర్ హబ్ కింద చేపట్టే అభివృద్ధి పనుల్లో భాగంగా భారీ ఎత్తున ఇరిగేషన్ ప్రాజెక్టుల అభివృద్ధి.. డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం, రహదారులు, లాజిస్టిక్స్ అభివృద్ధి పనులు చేపట్టనున్న ప్రభుత్వం.. ప్రభుత్వం వెచ్చించే రూ.40,352 కోట్లలో ఇరిగేషన్ నిమిత్తం రూ.20,884 కోట్లు, ఉద్యాన అభివృద్ధికి రూ.15 వేలకోట్లు, రహదారుల అభివృద్ధికి రూ.4,562 కోట్లను ఖర్చు పెట్టనున్న కూటమి ప్రభుత్వంరైస్ బౌల్‌గా పేరొందిన ఏపీకి ఫ్రూట్ బౌల్ కీర్తి సాధించిపెట్టేలా రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్లానింగ్. మామిడి, అరటి, టమోటా, దానిమ్మ , డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బెర్రీ ప్రధాన పంటలకు ప్రోత్సాహం.వివిధ పంటలకు సంబంధించిన ఫుడ్ ప్రాసెస్ ప్లాంట్ల ఏర్పాటు.. ఎగుమతుల్లో ప్రైవేట్ పెట్టుబడులు వచ్చేలా ప్రణాళికలు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అమలుకు దాదాపు 6 నెలల నుంచి పెద్ద ఎత్తున కసరత్తు చేసిన సీఎం చంద్రబాబు వ్యవసాయ, ఉద్యాన, ఆర్థిక, ఇరిగేషన్ సహా వివిధ కీలక శాఖలతో ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపిన ముఖ్యమంత్రి. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కోసం చేసిన కసరత్తులో భాగంగా కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపిన సీఎం చంద్రబాబు, ఆయా శాఖల ఉన్నతాధికారులు.

రాయలసీమ రైజింగ్‌లో భాగంగా ఉద్యాన వెలుగులు నింపేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రూపొందుతుంది.

## అమరావతిలో విమానాశ్రయం నిర్మాణంపై ప్రముఖ సంస్థల ఆసక్తి

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టుకు నిర్మాణ పనుల టెండర్లు దక్కించుకునేందుకు పలు కీలక సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి.ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం పెద్ద పెద్ద కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. జీఎంఆర్, టాటా, అదానీ, ఫ్రాన్స్‌కు చెందిన విన్సి ఎయిర్‌పోర్ట్స్, ఫెయిర్‌ఫాక్స్ వంటి సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం కావాలని చూస్తున్నాయి. గుంటూరు జిల్లా తాడికొండ మండలం రావెల గ్రామం సమీపంలో సుమారు 5,000 ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఎయిర్‌పోర్ట్, అనుబంధ ప్రాజెక్టులు, రైతులకు తిరిగి ఇచ్చే ప్లాట్లతో కలిపి మొత్తం 20,000 ఎకరాల భూసమీకరణ అవసరమవుతుందని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రైతులకు అన్యాయం జరగకుండా ల్యాండ్ పూలింగ్ పద్ధతిలోనే భూములు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. చంద్రబాబుకు శంషాబాద్, భోగాపురం విమానాశ్రయాలను విజయవంతంగా నిర్మించిన ట్రాక్ రికార్డ్ ఉంది. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులను ఆకర్షించేలా ఏపీ ప్రభుత్వం రాజధాని అభివృద్ధిపై దృష్టి పెడుతుంది. దీంతో పారిశ్రామిక వర్గాలు ఈ ప్రాజెక్టు కోసం పోటీ పడుతున్నాయి. ఈ కంపెనీల ప్రతినిధులు ఇప్పటికే ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం.

## ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలి : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



వైద్యపరీక్షా శిబిరాన్ని పరిశీలిస్తున్న పట్టాబిరామ్

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గ్రామీణ మండలంలోని గూడవల్లి గ్రామంలో పట్టాభిరామ్, కార్పొరేషన్ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కలిసి గురువారం పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం చేశారు. రోడ్లు శుభ్రం చేశారు. స్వచ్ఛత హీ సేవ్లలో భాగంగా అందరం కలిసి ఒక రోజు, ఒక గంట (ఏక్ దిన్ ఏక్ గంటా ఏక్ సాత్)అనే పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. వారంతా స్వయంగా కొడవళ్లతో తుప్పలను తొలగించారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు వర్మీ కంపోస్ట్ తయారీ ప్రక్రియను, ఐఈసీ(ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యునికేషన్) వాల్ పెయింటింగ్స్‌ను, జేసీబీతో జరుగుతున్న పనులను, స్వచ్ఛరథాన్ని పరిశీలించారు. మట్టితో చేసిన గ్లాసులు, వాటర్ బాటిళ్లు, చెక్క స్పూన్లు, పేపర్ గ్లాసులు వంటి బయోడీగ్రేడబుల్, డిస్పోజబుల్ వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి, వారికి స్వీట్ బాక్స్ లు ఇచ్చి, పారితోషికాలు అందజేశారు. ఏఎన్ఎంలు వారికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే, గ్రామ పంచాయతీలో వ్యర్థాల విభజనను ప్రోత్సహించిన స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. కళాశాల విద్యార్థులకు పారిశుద్ధం, 4 రకాలుగా వ్యర్థాల విభజనపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానివేయాలన్నారు. వాటి స్థానంలో పర్యావరణానికి హాని కలిగించని బయోడీగ్రేడబుల్, డిస్పోజబుల్ వస్తువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. స్వచ్ఛత కోసం మనమంతా కలిసి ఒక అడుగు ముందుకు వేద్దాం అన్నారు. పరిశుభ్రమైన సమాజానికి మన వంతు సహకారం అందిద్దాం, పరిశుభ్రతను పాటిద్దాం, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం అని పట్టాభిరామ్ పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు చిన్ని శ్రీనివాసరావు, రవి కుమార్, ఆరుద్ర భూలక్ష్మి, లక్ష్మణరావు బొమ్మినేని, ఎం.నాగలక్ష్మి, ఎన్.పర్వీన్ భాను, నాగమణి బోలెం, పరుచూరి భవానీ రవికుమార్, రాము బుచ్చా, రెడ్డివారి మంజునాథ్, సానారెడ్డి కల్పనారెడ్డి, ఉదయ భాస్కర్ కూచిపూడి, పట్టాభిరామయ్య సాలాది, ముప్పల వెంకట రమణ, కార్పొరేషన్ ఈడీలు ఊర్మిళాదేవి, అర్జునరావు, ఎఫ్‌ఎం విజయశేఖర్, గూడవల్లి పీడీఓ యు.భార్గవ తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా సామాజిక మాధ్యమ బృందానికి బెస్ట్ సోషల్ మీడియా ఎంగేజ్‌మెంట్ అవార్డు

**- నేడు ప్రదానం చేయనున్న సిఎం చంద్రబాబు**

**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్న నోడల్ ఏజెన్సీ మెప్మా , స్వచ్ఛ ఆంధ్ర అవార్డులలో నాలుగు రాష్ట్ర స్థాయి అవార్డులను, 75 జిల్లా స్థాయి అవార్డులను గెలుచుకుని ఒక అద్భుతమైన మైలురాయిని అధిగమించింది. ఈ పోటీల్లో పాల్గొన్న 21 ప్రభుత్వ శాఖలలో మెప్మా అగ్రస్థానంలో నిలిచి, ప్రతిష్టాత్మకమైన ఖిబెస్ట్ సోషల్ మీడియా ఎంగేజ్‌మెంట్‌ఖి అవార్డును కైవసం చేసుకుంది. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిర్వహించిన ఈ మూల్యాంకనంలో మెప్మా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన కంటెంట్ నాణ్యత, వినూత్న ప్రచారాలు, క్రమం తప్పకుండా సమాచారాన్ని పంచుకోవడం, ప్రజల భాగస్వామ్యం (లైకులు, షేర్లు) మరియు స్వచ్ఛ ఆంధ్ర నినాదాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు గాను ఈ గుర్తింపు లభించింది. డిజిటల్ రంగంలోనే కాకుండా, క్షేత్రస్థాయి పర్యావరణ కార్యక్రమాలలో కూడా మెప్మా అద్భుత విజయాన్ని సాధించింది. కాకినాడ, శ్రీకాకుళం, మరియు పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన మూడు మెప్మా స్లమ్ లెవల్ ఫెడరేషన్లు , టెర్రస్ గార్డెన్ (మిద్దె తోటలు) విభాగాలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి స్వచ్ఛ ఖీలీనీ అవార్డులను సొంతం చేసుకున్నాయి. వీటితో పాటు, రాష్ట్రవ్యాప్తంగా వివిధ మెప్మా విభాగాలు 75 జిల్లా స్థాయి అవార్డులను సాధించి, పట్టణ సుస్థిరతపై తమకున్న లోతైన ముద్రను చాటిచెప్పాయి. ఈ ప్రతిష్టాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఈనెల 2 శుక్రవారం విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనుంది. ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి, మెప్మా సోషల్ మీడియా బృందానికి బెస్ట్ సోషల్ మీడియా ఎంగేజ్‌మెంట్ అవార్డును స్వయంగా అందజేయనున్నారు.ఈ గొప్ప విజయం పట్ల మెప్మా మిషన్ డైరెక్టర్ శ్రీమతి వాకాటి కరుణ, ।తిళీ హర్షం వ్యక్తం చేశారు.

## బిసిలకు దక్కాల్సిన పదవులను అడ్డుకోవడమే

**వైఎస్సార్సీపి లక్ష్యం : మంత్రి సుభాష్**

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** దక్కాల్సిన రాజకీయ పదవులను అడ్డుకోవడమే వైఎస్సార్సీపీ కుట్ర అని మంత్రి సుభాశ్ మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీలకు 34శాతం రిజర్వేషన్లు రాకుండా కోర్టుకు వెళ్లారని, స్థానిక సంస్థల ఎన్నికలు జరగకూడదన్నదే వైఎస్సార్సీపీ ఏకైక అజెండా అని సుభాశ్ ఆరోపించారు. రాజకీయ ప్రాధాన్యత పెరగకూడదనే కుట్రతోనే కోర్టును ఆశ్రయించారన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో 16,800 మంది బీసీ నేతలు పదవులు కోల్పోయారన్నారు. పదవులు దక్కకుండా మళ్లీ కోర్టుల ద్వారా అడ్డుకుంటున్నారని, బీసీలకు 34శాతం రిజర్వేషన్ల రక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని 34శాతం రిజర్వేషన్ల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీలకు దక్కాల్సిన ప్రతి అవకాశాన్ని కాపాడేందుకు వెనకడుగు వేయమని మంత్రి సుభాశ్ స్పష్టం చేశారు.

## గొల్లపల్లిలో రూ.1.03 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి ఆనం శ్రీకారం

**- ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు**
**- ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ**

**చేజర్ల (నెల్లూరు), అక్టోబర్ 1, ప్రభాతవార్త :** చేజర్ల మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీలో రూ.1.03 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గురువారం శ్రీకారం చుట్టారు. గొల్లపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేశారు.తొలుత గొల్లపల్లి ఎస్సీ కాలనీలో రూ.13.50 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని మంత్రి ఆనం ప్రారంభించారు. అనంతరం రైతుల ప్రయోజనార్థం డీఆర్డీఏ నిధులతో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు ఉత్పత్తిదారుల సంఘం గోడౌన్‌ను మంత్రి ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎస్సీ కాలనీలో ప్రజల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన సైడ్ కాలువలను, అలాగే ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.9లక్షలతో నిర్మించిన పలు సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు.

గొల్లపల్లి మెయిన్ విలేజ్‌లోని శ్రీరామాలయానికి రూ.5లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులతో పాటు, గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు.అదేవిధంగా గొల్లపల్లి తూర్పు ఎస్సీ కాలనీలో రూ.40 లక్షలతో నూతన శ్రీరామాలయం నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు.

## నిరుపేద కుటుంబానికి అండగా ప్రభుత్వం

**- కుటుంబ కష్టాలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని స్పందించిన మంత్రి లోకేష్, కలెక్టర్ హిమాన్షు శుక్ల - బాలుడికి రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశం.. పాపకు గుండె ఆపరేషన్‌కు చర్యలు - కుటుంబానికి ఇంటి స్థలం.. తండ్రికి వైద్యం - తల్లికి స్వయం సహాయక సంఘం ద్వారా ఆర్థిక చేయూత**



**నెల్లూరు, అక్టోబర్ 1, ప్రభాతవార్త - కలెక్టరేట్:** చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించారు. కుటుంబ పరిస్థితులను పరిశీలించి అవసరమైన సహాయం అందించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆదేశించారు. వైయస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన ఇస్తేరమ్మ, ఆశీర్వాదం చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు ఇటీవల తమ బిడ్డలతో నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడలో పడుతున్న కష్టాలు సోషల్ మీడియాలో పబ్లిష్‌కి అయ్యాయి. ఈ మేరకు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టి ఆ కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా నిలిచింది. కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న పరిస్థితిని తెలుసుకున్న మంత్రి నారా లోకేష్, పిల్లల భవిష్యత్తు, కుటుంబ ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. బాలుడి పరిస్థితిపై కూడా మంత్రి స్పందించి, బాలుడిని సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి చదువుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి కుటుంబానికి అవసరమైన చర్యలను ప్రారంభించారు. బాలుడు పురుష రామయ్య, వయస్సు 10 సంవత్సరాలు, ఎస్టీ ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన బాలుడు. దుత్తలూరు మండలం నరవాడ గ్రామంలో గుర్తించబడిన ఈ బాలుడిని నెల్లూరులోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలుర పాఠశాలలో చేర్పించి, వసతి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. పీడీ ఐసీడీఎస్ అధికారులు రామయ్యను తమ ఆధీనంలోకి తీసుకుని, ప్రస్తుతం నెల్లూరుకు తీసుకువస్తున్నారు. అదేవిధంగా కుటుంబంలోని పాపకు గుండె సంబంధిత సమస్యకు అవసరమైన ఆపరేషన్ చేయించేందుకు వైద్యపరమైన చర్యలు చేపట్టారు. అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సను ప్రభుత్వపరంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# బొత్స ఇలాకాలో సైకిలెక్కుతున్న వైసిపి శ్రేణులు



**విజయనగరం,గరివిడి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో గల కొండ పాలెం(గరివిడి), చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్‌లతోపాటు పలువురు వైకాపాకి రాజీనామా చేశారు. వీరంతా పంఖా పార్టీకి దూరమై సైకిలెక్కేందుకు సిద్ధమవుతున్నారు. చిన్న శ్రీను అడుగుల్లో నడిచేందుకు వారు సన్నద్ధమయ్యారు. చీపురుపల్లిలో గల జెడ్పి మాజీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు క్యాంప్ కార్యక్రమంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైకాపాకి రాజీనామా చేస్తున్నట్లు వారు వెల్లడించారు. కొండపాలెం(గరివిడి) మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ పి.ప్రమీల, చీపురుపల్లి మాజీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, రెస్కో మాజీ డైరెక్టర్ వలిరెడ్డి లక్ష్మణ్, కనక మహాలక్ష్మి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వాసుదేవరావు, మాజీ వార్డు సభ్యులు వలిరెడ్డి వాసు, విసినిగిరి ఈశ్వరరావు,కిరణ్ కుమార్, మాజీ ప్రాదేశిక సభ్యులు బమ్మిడి నరసయ్య, పి.కుమార్, చంద్రరావు, తదితరులు వైఎస్సార్ సీపీకి రాజీనామా చేశారు. వీరంతా చిన్న శ్రీనుతో కలసి టిడిపి తీర్థం పుచ్చుకోనున్నామని వెల్లడించారు. ఇటీవల వైకాపాకి రాజీనామా చేసిన చీపురుపల్లి జెడ్పిటిసి సభ్యులు వలిరెడ్డి శిరీష, మెరకముడిదాం మండల వైకాపా అధ్యక్షుడు కోట్ల విశ్వేశ్వరరావు, జిల్లా వైకాపా ప్రచార కన్వీనర్ వలిరెడ్డి శ్రీనివాసులు నాయుడు సమక్షంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వైఎస్సార్ సీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు కొందరు తృతీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఇంత కాలం శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ వెన్నంటి నడిచిన వీరంతా వైకాపాకి దూరమై, చిన్న శ్రీనుకి దగ్గరై పసుపు జెండా నీడకు పయనమవుతున్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి ఇద్దరికి తీవ్ర గాయాలు

**పెనుమంట్ర, అక్టోబర్01, (ప్రభాతవార్త):** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం పంపనవారిపాలెం వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలపైకి క్రీటా కారు దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. బైకులు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో బ్రాహ్మణచెరువు గ్రామానికి చెందిన జోగి రమేష్ (35) అక్కడికక్కడే మృతి చెందారు. ఆరవల్లి గ్రామానికి చెందిన దంపతులు వెలగల బాపిరెడ్డి (60), రామలక్ష్మి (55) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తణుకు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. క్రీటా కారు భద్రాచలానికి చెందినదిగా గుర్తించినట్లు సమాచారం. కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం దెబ్బతినడంతో పాటు ఎయిర్‌బ్యాగులు తెరుచుకున్నాయి. సమాచారం అందుకున్న పెనుమంట్ర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

**VISAKHAPATNAM INDUSTRIAL WATER SUPPLY COMPANY LIMITED**

RFP Tender Notice No.16/2026-27/DIR(T)/SGM/GM(VIWSCO)/ Dt: 29-09-2026
Number of works -1, Value of work : RFP Tender
Tender starting Date: 01-10-2026 @ 3.00 PM,
Tender Closing Date: 08-10-2026 @ 4.00 PM
Note: Further details at www.tender.apeprocurement.gov.in
O/o the GM (VIWSCO) Cell No.8187898428
Sd/- CMD (VIWSCO)

**KAKINADA MUNICIPAL CORPORATION**
**'e' PROCUREMENT TENDER NOTIFICATION**
Roc No. 7645/2025/E2 Dated: 30.09.2026
Tenders invited through ap e procurement platform for 39 works with an estimated cost value of Rs.3,46,74,750/- from the eligible contractors.
Last date and time for downloading for 20 Works: Dt. 14-10-2026 upto 10-00 AM.
Last date and time for downloading for 19 Works: Dt.26-10-2026 upto 10-00 AM.
Tender Inviting Authority: Commissioner, Municipal Corporation, Kakinada. Mail: kkd_mplcorp@yahoo.com, Call Centre Phone: 0884 2357722 Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in
Yours faithfully,
Sd/-N.V.V.Satyanarayana,
Commissioner (F.A.C),
Municipal Corporation, Kakinada.

02 -9Pg6exHMNWJQET.qxd:02 -9Pg6exHMNWJQET.qxd 1/1/02 7:28 AM Page 1



## నా దినచర్య మొదలయ్యేది అరకు కాఫీతోనే - సిఎం చంద్రబాబు

● ప్రపంచ కాఫీ దినోత్సవం సందర్భంగా సిఎం ట్వీట్



**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఉదయం నిద్రలేవగానే కాఫీ తాగితే కానీ రోజు ప్రారంభం కాదు. అయితే, తన దినచర్య మాత్రం గుమగుమలాడే అరకు కాఫీతోనే మొదలవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు వెల్లడించారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ గొప్ప వారసత్వానికి అరకు కాఫీ ఓ అద్భుతమైన ప్రతీకగా నిలుస్తోందని ఆయన కొనియాడారు.అరకు కాఫీ అద్భుత ప్రయాణాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రపంచానికి పరిచయం చేశారు. రాష్ట్రంలోని పచ్చని గిరిజన కొండల ప్రాంతాల నుంచి ప్రారంభమైన ఈ అరకు కాఫీ ప్రయాణం, నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాఫీ ప్రియుల కప్పుల్లోకి చేరుతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇది మన రాష్ట్ర సంస్కృతికి, గిరిజన రైతుల కష్టానికి నిలువెత్తు నిదర్శనమని పరోక్షంగా గుర్తుచేశారు. అరకు ప్రాంతాన్ని కేవలం పర్యాటక కేంద్రంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయి కాఫీ గమ్యస్థానంగా (ప్రీమియర్ గ్లోబల్ కాఫీ డెస్టినేషన్) తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం చురుగ్గా పెట్టుబడులు పెడుతోందని వెల్లడించారు. తద్వారా స్థానికంగా కాఫీ పండిస్తున్న రైతులకు మరింత సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

# సంజీవనిపై 1.02 లక్షల మందికి శిక్షణ

● వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక ● 2008 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాలు
● ఈ నెల 12 నుంచి శిక్షణా కార్యక్రమాలు

**విజయవాడ,అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సంజీవని కింద వైద్య సేవలను జనవరి 1 నుంచి ప్రారంభించేందుకు వీలుగా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే అన్ని స్థాయిలోని వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, అధికారులు కలిపి 1.02 లక్షల మందికి శిక్షణ ఇవ్వబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. డిసెంబరు 10న సంజీవని సేవలను ట్రయల్ రన్ కింద ప్రారంభిస్తామని వెల్లడించారు, 2027 జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు చేస్తామని వెల్లడించారు. ఈమేరకు సంజీవని ప్రాజెక్టు అమలు కింద తీసుకుంటున్న చర్యలపై ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారంనాడు సమీక్ష జరిపారు. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,008 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంజీవని సేవల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో 537 కేంద్రాల్లో సంజీవని సేవల కోసం ప్రత్యేక గదులను సిద్ధం చేస్తున్నారు. మరో 1,726 కేంద్రాల్లో నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా యూపీఎస్ లేదా ఇన్వర్టర్ సదుపాయాలను కల్పించనున్నారు. ఈ ఏర్పాట్లను నవంబరు 30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సంజీవని సేవలకు అవసరమైన కంప్యూటర్లు, ట్యాబ్లెట్లు, ప్రింటర్లు, స్కానర్లు, యూపీఎస్‌లు, వెబ్ కెమెరాలు, స్పీకర్లు, హెడ్‌ఫోన్లు తదితర పరికరాలను ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా సమకూరుస్తున్నారు. సంజీవని ప్రాజెక్టు అమలులో భాగంగా రాష్ట్రంలోని వైద్య కేంద్రాల్లో 2,277 మంది రోగి సేవల సమన్వయకర్తల(సిహెచ్ ఓలుపేషెంట్ కోఆర్డినేటర్లు) గుర్తించి నియమించే ప్రక్రియ చేపట్టారు. వీరు రోగులకు అందించే సేవల సమన్వయం, వైద్య సమాచార నమోదు, సంబంధిత ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల మధ్య సమన్వయం చేస్తారు. వీరిని ప్రధానంగా సామాజిక ఆరోగ్య అధికారులు, మధ్యస్థాయి ఆరోగ్య సేవల సిబ్బంది(డిజిగ్నేషన్ రాయాలి) నుంచి ఎంపిక చేస్తున్నారు. అదనంగా 76 మంది జిల్లా స్థాయి సేవల సమన్వయకర్తలను గుర్తించారు. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయిల్లోని ఆసుపత్రుల మధ్య సమన్వయం మెరుగుపరిచేందుకు వీరిని వినియోగించనున్నారు. సంజీవని సేవల అమలులో ఎదురయ్యే సమస్యలను గుర్తించడం, సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోవడం, సేవలు సజావుగా సాగేలా చూడటం వీరి బాధ్యతల్లో భాగంగా ఉంటుంది.టాటా సంస్థ వారు సంజీవని కింద చేపట్టే కార్యక్రమాల వివరాలను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయాలి, రోగులకు ఎలాంటి సర్వీసులు అందించాలి, పరీక్షలు ఎలా జరపాలి, అపాయింట్‌మెంట్లు ఎలా ఇప్పించాలి, తీసుకోవాల్సిన ఇతర చర్యలపై శిక్షణా కార్యక్రమాల ద్వారా వైద్యులు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ కార్యక్రమాలను



రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో ప్రత్యక్షంగా, వర్చువల్ విధానంలో నిర్వహించనున్నారు. రోగి సేవల సమన్వయకర్తలకు అక్టోబరు 12 నుంచి నవంబరు 6 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం నవంబరు నెలలో వైద్యులు, వైద్య సహాయక సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ అందించనున్నారు. డిజిటల్ పద్ధతిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, పని విధానాలను అనుసంధానించడం, ఆరోగ్య గుర్తింపు సంఖ్య నమోదు చేయడం వంటి అంశాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇవ్వనున్నారు. సంజీవని వ్యవస్థలో నిర్దేశించిన విధానాలను సిబ్బంది సక్రమంగా అనుసరించేలా శిక్షణ ఇస్తారు. మరోవైపు మంగళగిరి ఎయిమ్స్‌లో డాక్టర్ ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల అధికారులకు సంజీవని అమలుపై శిక్షణ ఇచ్చారు. సంజీవని ప్రాజెక్టుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సుమారు 74 వైద్య అప్లికేషన్స్(పోర్టల్ ఇతర), అనుసంధానం చేయనున్నారు. తొలి దశలో వైద్య సేవలు, క్షేత్రస్థాయి కార్యకలాపాలు, పర్యవేక్షణకు అవసరమైన ముఖ్యమైన వ్యవస్థలను అనుసంధానించనున్నారు. ఈ ప్రక్రియను డిసెంబరు 10 నాటికి పూర్తి చేయాలని లక్ష ్యంగా పెట్టుకున్నారు. ఇందులో నెక్స్ జెన్, ఈఔషధి వంటి వ్యవస్థలు ఉన్నాయి. తదుపరి దశల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్టు వ్యవస్థలు, ప్రజల ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన వివరాలు, వైద్య నిర్ధారణ వ్యవస్థలు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సమాచార వేదికలను అనుసంధానించనున్నారు. ఈ అనుసంధానం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, క్షేత్రస్థాయిలో నమోదు చేసిన సమాచారాన్ని వివిధ వైద్య సేవలకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ఒకే సమాచారాన్ని పలుమార్లు నమోదు చేయాల్సిన అవసరాన్ని తగ్గించి, వైద్య సేవల నిర్వహణలో సమన్వయం పెంచడం ఈ చర్యల లక్ష్యం.మంగళగిరిలో టాటా ఎండీ సంస్థ ఆధ్వర్యంలో స్టేట్ సంజీవని ఇంటిగ్రేటెడ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఖి ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సంజీవని సేవల నిర్వహణను పర్యవేక్షించి, అవసరమైన సమన్వయం చేయనున్నారు. ఇందుకోసం 275 మంది సిబ్బందిని నియమించి, శిక్షణ ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా స్థాయి సాంకేతిక సిబ్బందికి ప్రత్యక్షంగా, విధుల్లో భాగంగా శిక్షణ అందించనున్నారు. నవంబరు 30 నాటికి ఈ కమాండ్ కంట్రోల్ సేవలు వేగాన్ని అందుకుంటాయి

# ఎన్నికలపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించాలి

● ఓటర్ల వాక్కు పరిరక్షించేందుకు పోరాటాలకు సిద్ధమని హెచ్చరిక ● డా. ఎన్. రఘువీరా రెడ్డి




**విజయవాడ, అక్టోబరు 1, ప్రభాతవార్త :**ంద్ర ఎన్నికల సంఘం వ్యవ హరిస్తున్న తీరుపై, ఓటర్ల జాబితాల సవరణ పేరుతో జరుగుతున్న పరిణామాలపై దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డా. ఎన్. రఘువీరా రెడ్డి అన్నా రు. గురువారం మధ్యాహ్నం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారు గత కొంతకాలంగా ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలకు సంబంధించి లేవనెత్తుతున్న అనేక ప్రశ్నలకు ఇప్పుడు వివిధ నివేదికలు మరింత ప్రాధాన్యతను తీసుకొస్తున్నాయని అన్నారు. ఇటీవల ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన పరిశోధనాత్మక కథనంలో ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలు, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై వ్యక్తమైన అభ్యంతరాలు వెలుగులోకి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో 13 కోట్లకు పైగా పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాల నుంచి తొలగించబడినట్లు వివిధ నివేదికలు వెల్లడిస్తున్నాయని డా. రఘువీరా రెడ్డి తెలిపారు. అయితే, ఎన్నికల సంఘం ఈ సంఖ్యను తుది తొలగింపులుగా పరిగణించరాదని, ప్రక్రియలో భాగంగా పేర్లను పరిశీలిస్తున్నామని పేర్కొంటున్న నేపథ్యంలో, ప్రతి తొలగింపుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్క అర్హత కలిగిన ఓటరు పేరు కూడా తప్పుగా తొలగించబడకుండా చూడటం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత అని ఆయన అన్నారు. ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసుకునే అవకాశం ప్రతి అర్హత కలిగిన పౌరుడికి సులభంగా అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థపై ప్రజలు, రాజకీయ పార్టీలు విశ్వాసం కలిగి ఉండటం ప్రజాస్వా మ్యానికి అత్యంత అవసరమని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్నారు. ఎన్నికల జాబితాల్లో పేర్ల తొలగింపు, చేర్పులు, సవరణలకు సంబం ధించిన పూర్తి డేటాను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తొలగించబడిన ఓటర్ల వివరాలను పూర్తిగా వెల్లడిం చి, అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటు ప్రతి భారతీయుడి రాజ్యాంగ హక్కు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా జాబితా నుంచి మిస్ కాకూడదు. ఓటర్ల హక్కు లను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా తన పోరాటాన్ని కొనసాగిస్తుంది అని డా. ఎన్. రఘువీరా రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కొలనుకొండ శివాజీ, వి.గురునాథం, కొరివి వినయ్ కుమార్, మేడా సురేష్, అంబటి రామకృష్ణ, బైపూడి నాగేశ్వరరావు, షేక్ ఖుర్షిదా, బొర్రా కిరణ్, జంగా గౌతమ్, నరహరిశెట్టి నరసింహారావు, చిలకా విజయ్ కుమార్, శొంఠి నాగరాజు, భేగ్, ప్రనీత తదితరులు పాల్గొన్నారు.

## కోటిపల్లి-నరసాపూర్ రైల్వే లైన్‌కు
# రూ.100 కోట్ల అదనపు నిధులు

● మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి



**విజయవాడ,అక్టోబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** కోనసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అయిన కోటి పల్లి - నరసాపూర్ కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ ప్రా జెక్టు పనులను వేగవంతం చేసేందుకు ఏపీ కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం రాష్ట్ర వాటా కింద అదనంగా రూ. 100 కోట్లను మం జూరు చేసినట్లు మంత్రి ఒక ప్రకటనలో పేర్కొ న్నారు.కేంద్ర రైల్వే శాఖతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 25 శాతం నిధులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరిస్తోందని మంత్రి తెలిపారు. ఇందులో భూసేకరణ (లితి) మరియు సివిల్ వర్క్స్ ఖర్చులు కూడా అంత ర్భాగంగా ఉంటాయని ఆయన తెలిపారు. గతం లో భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేసి న ఖర్చులను కూడా రాష్ట్ర వాటా కిందనే పరిగణనలోకి తీసుకునేందుకు రైల్వే శాఖ అంగీకరించిందని మంత్రి తెలిపారు. మంజూరైన రూ. 100 కోట్ల నిధులను తక్షణమే అమలాపురం ఆర్డీవో ఖాతాకు బదిలీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వాటా నిధుల లభ్యత కారణం చూపి పనులు ఎక్కడా నిలిపివేయకుండా నిరంతరాయంగా కొనసాగించాలని గతంలోనే కేంద్రాన్ని కోరడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతో పూర్తి చేయాలని, అనంతరం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులను చెల్లిస్తామని గతంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విణి వైష్ణవ్ కు లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కోటిపల్లి - నరసాపూర్ రైల్వే లైన్ పనులు ఇకపై శరవేగంగా సాగుతాయని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## రెట్టింపు నగదు పేరుతో భారీ వసూళ్లు

● సంస్థ చందాల పేరుతో పాస్టర్ రూ.40 కోట్ల వరకు వసూళ్లు
● నాలుగు నెలలుగా భారీగా సాగుతున్న స్కాం
● పోలీసుల అదుపులో పాస్టర్ కుటుంబం



**కనిగిరి, ప్రభాతవార్త:** వారంలో, 15 రోజుల్లో లేదా నెలలో పెట్టుబడి పెట్టిన నగదును రెట్టింపు చేసి ఇస్తామంటూ భారీగా నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు రావడంతో కనిగిరిలో గురువారం కలకలం నెలకొంది. బెంగళూరు కేంద్రంగా నిర్వహిస్తున్న ఓ సంస్థ పేరుతో ఈ వసూళ్ల వ్యవహారం కొనసాగినట్లు స్థానికుల ద్వారా సమాచారం. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో ఉన్న ఓ చర్చి పాస్టర్ ఈ వ్యవహారాన్ని నిర్వహించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.స్థానికుల సమాచారం మేరకు.. రెండేళ్ల క్రితం చిన్న మొత్తాలతో ప్రారంభమైన ఈ వ్యవహారం గత నాలుగు నెలలుగా భారీ స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. పెట్టుబడి పెట్టిన మొత్తానికి రెట్టింపు నగదు వస్తుందని ఆశ చూపుతూ, ప్రధానంగా మహిళలను ఆకర్షించి సంస్థ చందాల పేరుతో సుమారు రూ.40 కోట్ల వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కనిగిరి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు, పొరుగు నియోజకవర్గాలకు సైతం ఈ వ్యవహారం విస్తరించినట్లు సమాచారం.మొదట పెట్టుబడి పెట్టిన కొందరికి రెట్టింపు మొత్తాలు చెల్లించినట్లు ప్రచారం ఉండటంతో వారు తమ బంధువులు, స్నేహితులు, పరిచయస్తులకు ఈ పథకాన్ని చెప్పినట్లు తెలుస్తోంది. మరిపూడి మండలానికి చెందిన ఓ వ్యక్తి రూ.75 లక్షలు పెట్టుబడిగా పెట్టగా, ఆయనకు రూ.1.50 కోట్లు చెల్లించినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీంతో కనిగిరితో పాటు పొదిలి, పామూరు, మార్కాపురం, కూచిపూడి, వేమవరం తదితర ప్రాంతాల నుంచి పలువురు భారీ మొత్తాల్లో నగదు పెట్టుబడిగా పెట్టినట్లు సమాచారం.

**అప్పులు చేసి.. బంగారం కుదువపెట్టి పెట్టుబడులు..**

ఈ వ్యవహారంలో వందలాది కుటుంబాలు చిక్కుకున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. కొందరు మహిళలు భర్తలకు తెలియకుండా అప్పులు చేసి నగదు పెట్టుబడిగా పెట్టినట్లు, మరికొందరు బంగారు ఆభరణాలను కుదువపెట్టి వచ్చిన మొత్తాన్ని ఈ సంస్థకు చెల్లించినట్లు సమాచారం. ప్రస్తుతం పెట్టుబడులు తిరిగి రాకపోవడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది.మోసపోయినట్లు తెలిసినప్పటికీ కుటుంబ సభ్యులకు విషయం తెలియడం, పరువు పోతుందనే భయం, పోలీసుల విచారణలో తమ పేర్లు బయటకు వస్తాయనే ఆందోళనతో పలువురు బాధితులు ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు కూడా పెట్టుబడులు పెట్టి నష్టపోయినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు.

**పోలీసుల విచారణ షురూ..**

కొంతమంది బాధితులు ఈ వ్యవహారంపై జిల్లాస్థాయి పోలీసు అధికారులకు సమాచారం అందించడంతో కనిగిరి పోలీసు యంత్రాంగం గురువారం రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. రాజీవ్‌నగర్‌లోని చర్చి పరిసర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి స్థానికులను విచారించినట్లు సమాచారం. పాస్టర్ కుటుంబాన్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. ఘటనా స్థలానికి వెళ్లిన మీడియా ప్రతినిధులు పోలీసులను ఫిర్యాదులపై ప్రశ్నించగా, తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని, ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపినట్లు సమాచారం.ఈ భారీ వసూళ్ల వ్యవహారంలో వాస్తవంగా ఎంతమంది బాధితులు ఉన్నారు? ఎంత మొత్తంలో నగదు వసూలైంది? సంస్థ వెనుక ఉన్నది ఎవరు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉద్యోగ మోసపూరిత ఆఫర్లపై
# అల్లూరి విమానాశ్రయం హెచ్చరిక

● స్పందించే ముందు నియామక సమాచారాన్ని అధికారిక మార్గాల
● ద్వారా ధృవీకరించుకోవాలని ఉద్యోగార్థులకు సూచన



**విజయనగరం, అక్టోబర్ 01, ప్రభాతవార్త:** అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం (విజాగ్ ఎయిర్‌పోర్ట్)ను అభివృద్ధి చేసి, నిర్వహిస్తున్న జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఎంఆర్ ఏరో)కు అనుబంధ సంస్థ అయిన జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీవీఐఏఎల్), విమానాశ్రయం, జీవీఐఏఎల్ లేదా జీఎంఆర్ గ్రూప్ పేరుతో ఉద్యోగ నియామకాలకు సంబంధించి వస్తున్న నకిలీ ఆఫర్లు, మోసపూరిత సమాచారంపై ఉద్యోగార్థులను అప్రమత్తం చేసింది. విమానాశ్రయం మరియు దాని నిర్వాహక సంస్థ పేరుతో ఇటీవల మోసపూరిత నియామక సమాచారాన్ని ప్రచారం చేస్తున్న ఘటన వెలుగులోకి రావడంతో ఈ హెచ్చరిక జారీ చేయబడింది. అధికారిక జీఎంఆర్ మార్గాల ద్వారా సంబంధిత సమాచారం నిజమైనదేనని స్వతంత్రంగా ధృవీకరించుకునే వరకు, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని చెప్పే వ్యక్తులకు ఉద్యోగార్థులు స్పందించకూడదని, ఎలాంటి చెల్లింపులు చేయకూడదని, వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని పంచుకోకూడదని సూచించింది. జీఎంఆర్ గ్రూప్ మరియు విజాగ్ ఎయిర్‌పోర్ట్ నియామక ప్రక్రియలో ఏ దశలోనూ అభ్యర్థుల నుంచి ఎలాంటి రుసుమును వసూలు చేయవు. ఎలాంటి చెల్లింపుకు బదులుగా ఉద్యోగం అందించబడదు. విమానాశ్రయంలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని లేదా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులు, ఏజెన్సీలు లేదా మధ్యవర్తులకు అభ్యర్థులు ఎలాంటి చెల్లింపులు చేయకూడదు. అలాగే, నియామకాల కోసం విమానాశ్రయంలో ప్రత్యక్ష ఇంటర్వ్యూలు (వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు) నిర్వహించబడవని విమానాశ్రయం స్పష్టం చేసింది. అన్ని నిజమైన ఉద్యోగ ఖాళీల వివరాలు జీఎంఆర్ గ్రూప్ అధికారిక కెరీర్స్ వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడతాయి. అభ్యర్థులు అధికారిక నియామక వేదిక ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి లేదా తమ దరఖాస్తులను సమర్పించాలి. నియామక ప్రక్రియకు సంబంధించిన అన్ని అధికారిక సమాచారాలు జీఎంఆర్‌కు చెందిన అధికారిక ఈమెయిల్ చిరునామాల నుంచే పంపబడతాయి. అందువల్ల, అనధికారిక ఈమెయిల్ చిరునామాలు, వాట్సాప్, సోషల్ మీడియా, వ్యక్తిగత ఫోన్ నంబర్లు లేదా ఇతర అనధికారిక మార్గాల ద్వారా అందే ఏదైనా ఉద్యోగ ఆఫర్, ఇంటర్వ్యూ కాల్, నియామక పత్రం లేదా ఇతర ఉద్యోగ సంబంధిత సమాచారాన్ని మోసపూరితమైనదిగా పరిగణించి, దానికి స్పందించకూడదని సూచించింది. భోగాపురం ఎయిర్‌పోర్ట్, విజాగ్ ఎయిర్‌పోర్ట్ లేదా అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉద్యోగం, ఇంటర్వ్యూ లేదా నియామక పత్రం ఇప్పిస్తామని హామీ ఇస్తూ, అందుకు ప్రతిగా డబ్బు లేదా ఇతర ప్రయోజనాలను కోరే వ్యక్తులు లేదా ఏజెన్సీల విషయంలో ఉద్యోగార్థులు ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇటువంటి సమాచారానికి స్పందిస్తూ అభ్యర్థులు ఎలాంటి నగదు లేదా ఇతర నిధులను బదిలీ చేయకూడదు. అలాగే, బ్యాంక్ ఖాతా వివరాలు, వన్‌టైమ్ పాస్‌వర్డ్‌లు (ఓటీపీలు), పాస్‌వర్డ్‌లు లేదా ఇతర సున్నితమైన వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని పంచుకోకూడదు. మోసగాళ్లు జీఎంఆర్ పేరు, లోగో, బ్రాండింగ్‌తో పాటు నకిలీ నియామక పత్రాలు, ఆఫర్ లెటర్లు మరియు అధికారికంగా కనిపించే ఇతర పత్రాలను ఉపయోగించి తమ మోసపూరిత సమాచారాన్ని నిజమైనదిగా చూపించే అవకాశం ఉందని విమానాశ్రయం హెచ్చరించింది. ఇటువంటి లోగోలు లేదా పత్రాలను ఉపయోగించడం మాత్రమే ఆ నియామక సమాచారం నిజమైనదని నిర్ధారించదు. ఉద్యోగార్థులు నియామకానికి సంబంధించిన ప్రతి సమాచారాన్ని స్పందించే ముందు, ఎలాంటి చెల్లింపు చేసే ముందు లేదా వ్యక్తిగత పత్రాలను పంచుకునే ముందు, జీఎంఆర్ గ్రూప్ అధికారిక కెరీర్స్ వెబ్‌సైట్ మరియు అధికారిక జీఎంఆర్ ఈమెయిల్ చిరునామాల ద్వారా తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించింది. ఉద్యోగార్థులు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉద్యోగాలు కల్పిస్తామని తప్పుడు హామీలు ఇచ్చే నియామక మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని విజాగ్ ఎయిర్‌పోర్ట్ విజ్ఞప్తి చేసింది.



# ధూళిపాళ్లలో భారీ చోరీ

● రూ.6 లక్షల నగదు, 40 సవర్ల బంగారు ఆభరణాలు అపహరణ

**సత్తెనపల్లి, అక్టోబరు 1, (ప్రభాత వార్త):** సత్తెనపల్లి మండలం ధూళ్లిపాళ్లలో ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంట్లోని బీరువాను పగలగొట్టిన దుండగులు సుమారు రూ.6 లక్షల నగదుతో పాటు 40 సవర్ల బంగారు ఆభర ణాలను అపహరించినట్లు సమాచారం. బాధి తుడు విశ్వేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకా రం.. ఇంట్లో భద్రపరిచిన నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అపహరణకు గురైన 40 సవర్ల బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. దుండగులు బీరువాను పగలగొట్టి అందులో ఉన్న నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీ ఘటనతో ఇంటి యజమాని విశ్వేశ్వరరావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన వ్యక్తుల వివరాలు, అపహరించిన సొత్తుకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.

# రాజకీయ సాధికారతే లక్ష్యంగా టిడిపి ప్రభుత్వం పనిచేస్తోంది

● ఎంపీ చింతకాయల విజయ్



**అమరావతి.అక్టోబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** బిసిసంక్షేమం, రాజకీయ సాధికారతే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ చింతకాయల విజయ్ అన్నారు. బీసీలు కేవలం ఓటర్లుగా కాకుండా పాలసీ మేకింగ్‌లో భాగస్వాములు కావాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని చెప్పారు. ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో టీడీపీ మొదటి నుంచీ అండగా నిలిచిందని విజయ్ తెలిపారు. 1987లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందని చెప్పారు. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వాటిని 34 శాతానికి పెంచారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు జీవో 105, జీవో 1065 ద్వారా స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్సీపీ కోర్టులను ఆశ్రయించిందని విజయ్ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమైతే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడుతుందని తెలిసినా రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు తీర్పును గౌరవిస్తూనే, ప్రభుత్వం న్యాయపోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించి బీసీల హక్కులను కాపాడతామని చెప్పారు.గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గినప్పుడు అప్పటి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని విజయ్ విమర్శించారు. దీంతో సుమారు 16,800 మంది బీసీలు రాజకీయ పదవులను కోల్పోయారని పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రయత్నిస్తుంటే వైఎస్సార్సీపీ అడ్డుకుంటోందని ఆరోపించారు. బీసీలకు టీడీపీలో సముచిత ప్రాధాన్యత ఉందని విజయ్ అన్నారు. తనను యువ బీసీ నాయకుడిగా రాజ్యసభకు పంపిన ఘనత చంద్రబాబు, లోకేష్‌లకే దక్కుతుందని చెప్పారు. అదే సమయంలో వైఎస్సార్సీపీ పాలనలో అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు వంటి బీసీ నేతలపై కేసులు, అరెస్టులు జరిగాయని ఆరోపించారు. బీసీలను రాజకీయంగా ఎదగనివ్వకూడదన్న ఆలోచనతో వైఎస్సార్సీపీ వ్యవహరిస్తోందని విజయ్ విమర్శించారు. బీసీలను నాయకత్వంలోకి తీసుకురావడం, పాలనలో భాగస్వాములను చేయడమే టీడీపీ లక్ష ్యమన్నారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూనే 34 శాతం రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టులో న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీసీలకు దక్కాల్సిన హక్కులను సాధించే వరకు వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు.

# పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు

**● శ్రీకాకుళం అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్ సమీక్ష ● స్వదేశ్ దర్శన్ 2.0 పనులపై ప్రత్యేకంగా చర్చ**




**శ్రీకాకుళం, అక్టోబర్ 1 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లాలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గురువారం ఢిల్లీ నుంచి జిల్లా అధికారులతో వర్చు వల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేంద్ర మంత్రి కార్యదర్శి శ్రీకేష్ లత్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద అరసవల్లి అభివృద్ధికి రూ.55.74 కోట్ల నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో, చేపట్టాల్సిన అభి వృద్ధి, మౌలిక వసతుల పనులపై కేంద్ర మంత్రి అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. ప్రాజెక్టు పనులను వేగవంతంగా చేపట్టి, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అలాగే ఇండిగో సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.10 కోట్లతో శ్రీకూర్మం ఆలయంలో చేపడుతున్న అభి వృద్ధి కార్యక్రమాల ప్రస్తుత స్థితిగతులను జిల్లా కలెక్టర్ కేంద్ర మంత్రికి వివరించారు. త్వరలో ప్రారంభం కానున్న పలాస-కాశీబుగ్గ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులతో పాటు, జిల్లాలో సుమారు రూ.3,300 కోట్లతో చేపడుతున్న 54 రైల్వే ఓవర్ బ్రిడ్జిల పనుల పురోగతిని కూడా కేంద్ర మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం నగరంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న నాలుగు పార్కుల నిర్మాణం, శ్రీకాకుళం-ఆముదాలవలస రహదారి విస్తరణ పనులు, జిల్లాలో కొనసాగుతున్న ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై కూడా సమీక్షించారు. పాత్రునివలస ఇండోర్ స్టేడియం నిర్మాణం, దాని ప్రస్తుత పరిస్థితిపై కేంద్ర మంత్రి ప్రత్యేకంగా చర్చించి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా 100 కోట్లు - 100 మంది పారిశ్రా మికవేత్తలు కార్యక్రమంపై ప్రజల్లో, పారిశ్రామి కవేత్తల్లో మరింత అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించా రు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమా లను సమన్వయంతో వేగవంతం చేసి, ప్రజలకు మౌలిక వసతులు, పర్యాటక సౌకర్యాలు మరింత మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి అధికారులకు సూచించారు.

**శ్రీకాకుళంలో అల్యూమినియం స్మెల్టర్ :**

శ్రీకాకుళం జిల్లాలో భారీ స్థాయి అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో సమావేశమై చర్చించారు. మూలపేటలో సుమారు 5,000 ఎక రాలు, పూండిలో 1,800 ఎకరాలు కలిపి దాదా పు 6,800 ఎకరాల ఉప్పు భూములు అందుబాటులో ఉన్నాయని రామ్మోహన్ నాయుడు వివరిం చారు. ఈ భూములను భారీ పారిశ్రామిక అభివృ ద్ధికి వినియోగించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. కష్టపడే తత్వం ఉన్న శ్రీకాకుళం జిల్లా ప్రజల మధ్య ఈ ప్రాజెక్ట్ విశేష ఫలితాలను అందిస్తుందని అభిప్రాయపడ్డారు.

మూలపేట-పూండి ప్రాంతానికి ఉన్న పోర్టు, జాతీయ రహదారి, రైల్వే, భవిష్యత్ విమాన కనెక్టివిటీ వంటి మౌలిక వసతులు భారీ పరిశ్రమ ఏర్పా టుకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ములపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు భారీ స్థాయి సరకు రవాణాకు కీలకంగా నిలవనుంది. ప్రతిపాదిత స్మెల్టర్‌కు ఒడిశాలోని అంగుల్ ప్రాంతం నుంచి అల్యూమినా సరఫరా చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. దీనివల్ల ఒడిశాలోని అల్యూమినా పరిశ్రమను, ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంత పారిశ్రామిక, పోర్టు మౌలిక వసతులతో అనుసంధానించే అవకాశం ఉంటుంది. ఈ ప్రతిపాదనపై కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. వారం రోజుల్లో కేంద్ర గనుల శాఖ అధికారుల బృందం ములపేట-పూండి ప్రాంతాల్లో పర్యటించి భూములు, మౌలిక వసతులు, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను పరిశీలించనుంది.

ఉప్పు భూముల వినియోగం, పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి డీపీఐఐటితో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ తదుపరి చర్యలు చేపట్టనున్నారు. అల్యూమిని యం స్మెల్టర్ ఏర్పాటుతో ప్రత్యక్ష, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది. లాజిస్టిక్స్, ఇంజినీరింగ్, నిర్మాణం, గోదాము లు, సరఫరా గొలుసు, డౌన్‌స్ట్రీమ్ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ రంగాల్లో స్థానిక యువత, వ్యాపా రులకు కొత్త అవకాశాలు అందుబాటులోకి రాను న్నాయి. పోర్టు, రహదారి, రైల్వే, విమాన కనెక్టివి టీతో ములపేట-పూండి ప్రాంతం భవిష్యత్తులో భారీ పరిశ్రమలు, అనుబంధ తయారీ యూనిట్లు, లాజిస్టిక్స్ సంస్థలు, ఇతర పెట్టుబడులకు కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదన ఉత్తరాంధ్రలో పారిశ్రామికీకరణ, ఉపాధి, పెట్టుబడులు, మౌలిక వసతుల అభి వృద్ధికి మరింత ఊతమిచ్చే అవకాశం ఉంది. శ్రీకా కుళం పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా రామ్మోహన్ నాయుడు ముందుకు తీసుకువచ్చిన ఈ ప్రతిపాదనపై కేంద్ర గనుల శాఖ సానుకూలంగా స్పందించడం కీలక ముందడుగుగా నిలిచింది.

## అభివృద్ధి, స్థానిక ఎన్నికలకు అడ్డుపడుతున్న జగన్

**● టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్ల నరసింహా యాదవ్**



**తిరుపతి హెల్త్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** ఎన్డీఏ, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభివృద్ధి ధ్యే యంగా పనిచేస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ వర్గాలకు నగరపాలక, పంచాయితీ, కార్పొరేషన్ ఎన్నికలలో 30 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 105, 1065 జీవోలను జారీ చేయడం జరిగిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహా యాదవ్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జగన్ పరిపాలనలో కోర్టుకెళ్లి రిజర్వేషన్లను తగ్గించి వెనుకబడిన వర్గాలకు రావాల్సిన 16800 నామినేటెడ్ పోస్టులను బీసీ వర్గాలకు దక్కకుండా జగన్ చేశాడని ఆరోపించారు. అభివృద్ధిని, స్థానిక సంస్థల ఎన్నికలను జగన్మోహన్ రెడ్డి సైంధవుడిలా అడ్డుపడుతున్నాడని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఎలక్షన్ ప్రచారంలో ఇచ్చిన హామీలను దృష్టిలో పెట్టుకొని ఎన్డీఏ,కూటమి ప్రభుత్వం రిజర్వేషన్‌ను అమలు చేస్తుంటే వైసీపీకి చెందిన పిటిషనర్ పివెంకట నరసింహా శర్మ, న్యాయవాది గండాల శివ ప్రసాద్ రెడ్డి ద్వారా హైకోర్టులో కేసులు వేసి అడ్డు పడుతున్నారని ఆరోపించారు. వీరిరువురు జగన్‌కు సన్నిహి తులని, తగిన సాక్షాధారాలు మా దగ్గర ఉన్నాయని చెప్పారు. జీవోలను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు వెనక జగన్మోహన్ రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు.

## ఉద్యోగులకు హామీల అమలుపై రెవెన్యూ జెఏసి చైర్మన్ హర్షం

**విజయవాడ, అక్టోబరు 1, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెఏసి చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు హర్షం వ్యక్తం చేశారు. అక్టోబర్లో ఇస్తానన్న రెండు డిఏ లను సెప్టెం బర్ జీతాలతో కలిపి ఇవ్వడం, రిటైర్డ్ ఉద్యోగులకు క్వాంటం పెన్షన్ పెంపుదల, ఉద్యోగుల హెల్త్ విషయంలో ఎప్పుడూ లేనివిధంగా ఉద్యోగుల వాటా, ప్రభుత్వ వాటా ప్రతినెల క్రమం తప్పకుండా జమ చేయడంపై నిర్ణయం తీసుకోవడం, పిఆర్సి కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏస్ 1983 బ్యాచ్‌కు చెందిన దినేష్ కుమార్ నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యోగుల సమస్యలను దశల వారీగా పరిష్కారానికి కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌కి, నారా లోకేష్‌కి కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. పిఆర్సీ కమిషన్ రిపోర్ట్ ఇచ్చేలోపు ఐ.ఆర్ ప్రకటించాలని, పిఆర్సీ రిపోర్టు కూడా ఇచ్చిన గడువు కంటే ముందే ఇచ్చే విధంగా పిఆర్సీ కమి షన్ రిపోర్ట్ తెప్పించుకుని, సీనియర్ ముఖ్యమం త్రిగా మెరుగైన పిఆర్సి ఇస్తారని ఆశిస్తున్నామని, అలాగే సిపిఎస్ విషయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి సిపిఎస్ ఉద్యోగులకు ఓపి ఎస్ ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవడానికి కృషి చేయాలని కోరారు. స్వర్ణ, గ్రామ వార్డు సచివాలయంలో పనిచేస్తున్న సచివాలయల ఉద్యోగులకు ఎఎస్ ఇవ్వాలని, సచివాలయ ఉద్యోగులకు ఆవేశంతో విజయవాడ ధర్నా కార్యక్రమంలో ప్రభుత్వంపై ముఖ్యమంత్రిపై కొంతమంది అవగాహన లేక తెలిసి తెలియక చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటారని, ప్రభుత్వానికి అండగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు.

## ఎస్పీడిసిఎల్ లో 14 మందికి పదోన్నతులు




**తిరుపతి,అక్టోబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడిసిఎల్ లో 14 మందికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ సిఎండి శివ శంకర్ లోతేటి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీడిసిఎల్ అకౌంట్స్ విభాగంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న జె. చిన్న రాఘవులుకు జనరల్ మేనేజర్ గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ, సంస్థ కార్పొరేట్ ఆఫీసులో రెవెన్యూ, ఇంటర్నల్ ఆడిట్ విభాగపు జనరల్ మేనేజర్ గా నియమించారు. అలాగే అకౌంట్స్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ వి బ్రహ్మాచారికి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అకౌంట్స్ విభాగంలోనే అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నుండి అకౌంట్స్ ఆఫీసర్ గా ఒకరికి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నుండి అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లుగా ముగ్గురికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న జి. ఎల్లప్పకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా ఉద్యోగన్నతి కల్పించారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న నలుగురికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగానూ, జూనియర్ ఇంజనీర్లుగా విధులను నిర్వహిస్తున్న ముగ్గురికి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగాను ఉద్యోగోన్నతి కల్పిస్తూ సిఎండి శివశంకర్ లోతేటి ఉత్తర్వులు జారీ చేశారు.

## తిరుపతి జిల్లాలో చెడ్డీ గ్యాంగ్ కదలికలు

**తిరుపతి,అక్టోబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రాస్థలం,పుణ్యక్షేత్రం తిరుపతి జిల్లాలో చెడ్డీగ్యాంగ్ కదలికలతో జనం వణికిపోతున్నారు. ఇటీవల కాలంలో ఈ గ్యాంగ్ కదలికలున్నా పోలీసులు అప్రమత్తమై నిఘా పెంచడంతో పరారయ్యారు. మళ్ళీ బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత చెడ్డీగ్యాంగ్ తిరుపతి నగరం శివార్లలోని తిరుచానూరు పంచాయతీలో కొత్తపాలెంలో అర్ధరాత్రి చెడ్డీ గ్యాంగ్ సంచారంపై సిసి కెమెరాల్లో పోలీసులు గుర్తించారు. ఈ గ్యాంగ్ ముఠా ముఖాలకు మాస్కులు ధరించి, చెడ్డీలతో పలు ఇళ్లల్లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. అయితే జనం కదలికలతో ఎలాంటి దొంగతనం చేయకుండానే వెళ్లిపోయారు. అయితే చడ్డీ గ్యాంగ్ తిరుపతిలో సంచరిస్తుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.వరుసగా హైదరాబాద్ లోని మణికొండ, తర్వాత అనంతపురం, ఇప్పుడు తిరుపతికి ఈ గ్యాంగ్ చేరుకుందని పోలీసులు అనుమానిసున్నారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

**పోలీస్ శాఖకు విశిష్ట సేవలందించిన**

## కానైన్ క్యాండీ మృతి



**తిరుపతి,అక్టోబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరు పతి జిల్లా పోలీస్ శాఖలో పేలుడు పదార్థాల గుర్తింపు విభాగంలో సేవలందించిన ల్యాబ్ర డార్ రిట్రీవర్ క్యాండీ గురు వారం ఉదయం మృతి చెందింది. పోలీసు అధికారులు, సిబ్బంది క్యాండీకి పుష్పాంజలి ఘటిం చి నివాళులు అర్పించారు. మంగళగిరిలోని కానైన్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొంది, తన సేవా కాలంలో ప్రముఖుల కాన్వాయ్ తనిఖీలు, యాంటీ సాబో టేజ్ తనిఖీలు నిర్వహించింది. రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్స వాలతో బాటు పలు ముఖ్య కార్యక్రమాల్లో భద్రతా విధులు నిర్వహించి సమర్థవంతంగా సేవలందించింది. క్యాండీకి హెడ్ కానిస్టేబుల్ ఏ. రాజేష్ హ్యాండ్లర్‌గా విధులు నిర్వహించారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ, క్యాండీ పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించి, ముఖ్యమైన భద్రతా విధుల్లో విలువైన సేవలందించిందన్నారు. దాని సేవలను పోలీస్ శాఖ స్మరించుకుంటుంది" అని పేర్కొన్నారు.

# కుప్పం సమగ్రాభివృద్ధే ధ్యేయం

**● కడ పి.డి. వికాస్ మర్మత్ ● సిఎం ఆదేశాలతో ప్రజల జీవన ప్రమాణాల పెంపు !! ● యేడాదిలోగా యువతకు 20వేల ఉద్యోగాలు.. మార్చిలోగా ప్రతి ఇంటికీ సోలార్ !! ● అంతర్జాతీయ స్థాయిలో కుప్పంలో మానస సరోవర్ వర్సిటీ !!**



**కుప్పం, అక్టోబర్ 1 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు నాయుడు ఆదేశాలతో విజన్ 2029 లక్ష్యంతో కుప్పం సమగ్రాభివృద్ధే ధ్యేయంగా చర్యలు చేపట్టామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. గురువారం కడ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పా త్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం ప్రజల జీవన, ఆర్థిక ప్రమాణాల పెంపే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. కుప్పంలో ఇళ్లులేని పేదలకు త్వరలోనే 3వేల ఇళ్లు మంజూరవుతాయన్నారు. అలాగే 16కోట్లతో నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తి చేసేందుకు సిఎం ఆదేశించారని తెలిపారు.మార్చిలోగా కుప్పంలో ప్రతి ఇంటికీ సోలార్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కుప్పాన్ని 360డిగ్రీల కోణంలో మోడల్ నియోజకవర్గంగా మలచేందుకు చర్యలు చేపట్టామన్నారు. దాదాపు 100కోట్లతో కుప్పం ఆర్టీసీ మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణం దసరా నాటికి ప్రారంభం అవుతుందన్నారు. ఈ ప్రాంతంలోనే మాల్, మల్టీప్లెక్స్ థియేటర్ల నిర్మాణం జరుగుతు ందన్నారు. అలాగే 7కోట్లతో డికెపల్లి చెరువు సుం దరీకరణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని చెప్పా రు. సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌లో కుప్పం రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. ఇటీవలే జాతీయ స్థాయిలో పి4కా ర్యక్రమం, నెట్‌జీరో కార్యక్రమాలకు స్కోచ్ అవార్డులు లభిం చాయన్నారు. 2027కల్లా కుప్పంలో 20వేలమంది యువ తకు ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే గ్లోబల్ మానస్ సరోవర్ వర్సిటీ 14-15 కళాశాలతో అంత రా జతీయ స్థాయిలో ప్రారంభం అవుతుందన్నారు. కుప్పంలో 9804బంగారు కుటు ంబాలను గుర్తించి వారికి వివిధ రకా ల ఉపాధి అవకాశాలు మార్గదర్శుల ద్వారా కల్పిస్తున్నా మన్నారు. కుప్పంలో ఆధునాతన రైతుబజార్‌ను 2కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. 10కోట్లతో ఆర్డీఓ, డిఎస్పీ కార్యాలయాల నిర్మాణంకు ఇటీవలే సిఎం శంకుస్థాపన చేశారన్నారు. పంచాయతీల్లో 230 హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు కుప్పానికి గండికోట జలాలు తేవాలని ఆదేశించారన్నారు. ముమ్మందు గండికోటజలాలతో ప్రజలకు తాగునీరు అందిస్తామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ జలాలను వ్యవసాయం, పరిశ్రమలకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ముమ్మందు కుప్పంలో విద్యుత్ తీగలు, వంటగ్యాస్, డ్రైన్లు, ఇంటర్నెట్ తదితర సౌకర్యాలు భూగర్భంనుంచే ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మల్లానూరు, డికెపల్లి వద్ద రైల్వే ఆర్ఓబిల నిర్మాణంకు సిఎం చంద్రబాబునా యుడు కేంద్రరైల్వేమంత్రితో చర్చించారన్నారు. మరో ఏడాదిలో కుప్పం రూపురేఖలు మారుతున్నాయన్నారు. సిఎం చంద్రబాబు చొరవతో కుప్పంలో క్షేత్రస్థాయిలో ప్రగతి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు.

## వరికోత యంత్రం కింద పడి ఆపరేటర్ మృతి

**చేజర్ల (నెల్లూరు), అక్టోబర్ 1, ప్రభాతవార్త :** వరికోత యంత్రంలో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కట్టర్ బార్ మీద పడటంతో యంత్రం ఆపరేటర్ మృతి చెందిన ఘటన చేజర్ల మండలం నాగులవెల్లటూరు రెవెన్యూ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడి భార్య కాకి భార్గవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.కొడవలూరు మండలం గండవరం గ్రామంలోని దర్గా హరిజనవాడకు చెందిన కాకి అమరేంద్ర (26) గత పదేళ్లుగా వరికోత యంత్రం ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గత ఎనిమిది నెలలుగా చేజర్ల మండలానికి చెందిన వరికోత యంత్రంపై ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు భార్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ క్రమంలో బుధవారం నాగులవెల్లటూరు రెవెన్యూ పరిధిలో దామినేని రమాదేవికి చెందిన వరి పొలంలో యంత్రంతో వరికోత పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తన భర్త అమరేంద్ర యంత్రాన్ని నడిపినట్లు, అనంతరం మరో ఆపరేటర్ బాధ్యతలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.మధ్యాహ్నం సుమారు 3.50 గంటల సమయంలో వరికోత యంత్రంలో సాంకేతిక సమస్య తలెత్తి యంత్రం నిలిచిపోయిందని, ఈ విషయాన్ని యంత్రం యజమానికి ఫోన్ ద్వారా తెలియజేసినట్లు ఫిర్యాదులో తెలిపారు.యంత్ర యజమాని వచ్చేలోపు తన భర్త అమరేంద్ర యంత్రం కట్టర్ బార్ కిందకు వెళ్లి మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. యంత్రంలోని కొన్ని భాగాలు సరిగా పనిచేయకపోవడంతో వాటిని సుత్తితో కొడుతుండగా ఒక్కసారిగా కట్టర్ బార్ తన భర్త వీపుపై పడిందని, దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు.వెంటనే 108కు సమాచారం అందించగా సిబ్బంది అక్కడికి చేరుకుని అమరేంద్ర అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు పేర్కొన్నారు. అనంతరం వరికోత యంత్రం యజమాని సాయంత్రం 6.30 గంటల సమయంలో ఫోన్ చేసి ఘటనను కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు తెలిపారు. అమరేంద్ర మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో భార్య భార్గవి, ఆమె తండ్రి పాటూరి రవి, బంధువులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వీపు వెనుక భాగంలో తీవ్ర గాయాలైనట్లు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై గురువారం చేజర్ల పోలీస్ స్టేషన్‌లో కాకి భార్గవి ఫిర్యాదు చేసి, ఘటనపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, యంత్రంలో తలెత్తిన సాంకేతిక లోపం తదితర అంశాలపై పోలీసుల విచారణలో పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# తిరుమల సమాచారం

## నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఉండని ధ్వజారోహణం, అవరోహణం

**తిరుమల,అక్టోబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్స వాల్లో ధ్వజారోహణం,ధ్వజ అవరోహణం ఉండదు. మిగిలిన వాహనసేవలతోబాటు పుష్పకవిమానం ప్రత్యేకంగా నిర్వహిసానతరు. ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండవసారి దసరా నవరాత్రుల్లో నవరాత్రి బ్రహ్మోత్స వాలు ఈనెల 12నుండి మొదలుకానున్నాయి.ఈ బ్రహ్మోత్స వాల్లో ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ రాత్రి 6.30 నుండి 11.30 గంటల వరకు జరుగుతుంది. నవరాత్రి బ్రహ్మోత్స వాలలో అక్టోబరు 11న ఆదివారం రాత్రి 7 నుండి 9 గంటల వరకు అంకురార్పణం,12న ఉదయం 9 గంటలకు బంగారు తిరుచ్చి ఉత్స వం, రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనం, 13న ఉదయం 8 గంటలకు చిన్నశేష వాహనం,రాత్రి 7 గంటలకు హంస వాహనం, 14 న ఉదయం 8 గంటలకు సింహ వాహనం,రాత్రి రాత్రి 7 గంటలకు ముత్యపుపందిరి వాహనం , 15 న ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం,రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనం , 16న ఉదయం 8 గంటలకు - మోహినీ అవతారం,సాయంత్రం 6.30 గంటలకు గరుడ వాహనం ,17న ఉదయం 8 గంటలకుహనుమంత వాహనం,సాయంత్రం 4 గంటలకు పుష్పక విమానం,రాత్రి 7 గంటలకు గజ వాహనం ,18న అక్టోబరు 18 ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం,రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనం ,19న ఉదయం 7 గంటలకు స్వర్ణరథం,రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం, అక్టోబర్ 20వతేదీ మంగళవారం ఉదయం 6 గంటలకు చక్రస్నానంతో ముగుస్తాయి.

## భారీగా వచ్చిన భక్తులతో కొండ కిటకిట

- వెంకన్న సర్వదర్శనానికి 28 గంటలు



**తిరుమల,అక్టోబర్ 1 ప్రభాత వార్తప్రతినిధి:** పవిత్రమైన పెంటాసి మాసం కావడం దసరా సెలవుల కంటే ముందే ఏడు కొండలు భక్తజనసంద్రంగా మారింది. ఇష్టదైవమ్ శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం 1.50లక్షలమందికిపైగాభక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. ఉదయం 5గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యాకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల గోగర్భమ్ డ్యామ్ వరకు చేరాయి. ఉదయానికే సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం నిరీక్షణ తప్పలేదు. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 10గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. దీంతో టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. బయట క్యూలైన్లలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో అనునిత్యం పర్యవేక్షి స్తూ భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. అన్న ప్రసాదం విభాగం, ఆరోగ్య విభాగం, శ్రీవారి సేవా విభాగం, విజిలెన్స్ సిబ్బంది క్యూలైన్లలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను నిరంతరాయంగా పర్యవేక్షి స్తున్నారు.

## శ్రీవారికి హుండీ ఆదాయం రూ.126 కోట్లు

**తిరుమల,అక్టోబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సంపన్న వంతమైన దేవుడుగా ఖ్యాతి చెందాడు. సెప్టెంబర్‌నెలకు సంబంధించి తొమ్మిదిరోజులు పాటు వాహనసేవలు జరిగి భారీగా భక్తులు తరలివచ్చారు.మొక్కుబడుల్లో కానుకల రూపంలో హుండీ ఆదాయం 126కోట్లరూపాయలు లభించింది. వరుసగా గత తొమ్మిది నెలలుగా నెలవారీ హుండీ ఆదాయం వడ్డీకాసులవాడికి 110కోట్ల రూపాయలుపైగానే చేకూరింది. తాజాగా సెప్టెంబర్‌నెల హుండీ ద్వారా 126కోట్లు రూపాయలు ఆదాయం చేకూరడం విశేషం. దేశవిదేశాల్లోని భక్తులు మొక్కులుతీర్చుకునేందుకు తిరుమలకు భారీగా తరలివస్తుండటం, కానుకల రూపంలో హుండీకి నగదు, నగలు సమర్పించుకోవడం జరుగుతుంది. సెప్టెంబర్‌నెలకు సంబంధించి హుండీ ఆదాయం గమనిస్తే 10వతేదీ హుండీ ద్వారా 6.94కోట్లు రూపాయలు, 8వతేదీ 5.59కోట్లు రూపాయలు, 27న 5.07కోట్లు, 7న 4.75 కోట్లు వరకు ఆదాయం లభించింది. ఇక నెలలో వరుసగా సరాసరి 3.90కోట్ల రూపాయల వరకు ఆదాయం చేకూరడంతో 126.04కోట్ల రూపాయలు మార్కును అధిగమించింది. వడ్డీకాసులవెంకన్నకు అక్టోబర్ నెల కూడా కీలకమే. మరో పదిరోజుల్లో మొదలు కానున్న వెంకన్న నవరాత్రి బ్రహ్మోత్స వాల రోజుల్లోనూ హుండీ ఆదాయం మరింత రెట్టింపయ్యే సూచనలు ఉండవచ్చనేది టిటిడి వర్గాల అభిప్రాయం. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బడ్జెట్‌లో కూడా అధికంగా హుండీ ఆదాయంపైనే ఆధారపడి రూపొందిస్తారు. వార్షికబడ్జెట్‌లో 1,500 కోట్ల రూపాయలు హుండీ ఆదాయం రాబడిగా నమోదవుతుంది.

## మలివిడత బ్రహ్మోత్సవాలు వచ్చేస్తున్నా అన్నప్రసాదంలో 'పప్పు' మెనూవడ్డన ఏదీ?

**తిరుమల,అక్టోబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** భక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా తిరుమలలో శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాల తయారీలో మార్పులు తీసుకువస్తున్న టిటిడి బోర్డు, అధి కారులు కొన్ని నిర్ణయాలు అమలు చేయడంలో ప్రణాళికలకే పరిమితమై పోతున్నారు. దేశవిదేశాల నుండి ప్రతిరోజూ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అందిస్తున్న వెంగమాంబ అన్నప్రసాదంలో "పప్పు"మెనూ చేర్చాలని ఐదునెలల క్రిందట నిర్ణయం తీసుకున్నారు. అయితే అదనపు మెనూ ఇప్పటికీ భక్తులకు అందలేకపోతోంది. గత జూన్‌నెలలో తిరుమలలో రైస్‌మిల్లర్ల, పప్పులు సరఫరా చేసే వ్యాపారులతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఈ విషయంపైచర్చించారు. భక్తుల అభిప్రాయసేకరణలో కొందరు అన్నప్రసాదంతోబాటు అదనంగా పప్పును కూడా వడ్డిస్తే మరింత బాగుంటుందని భక్తులు సూచించడంతో టిటిడి అధికారులు కార్యాచరణ రూపొందించారు. అయితే ఆచరణలో మాత్రం ఇప్పటికీ అమలుకాలేదు. ప్రతిరోజూ 1.60లక్షలమంది నుండి 2లక్షలమందివరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారు. తిరుమలలో నిరంతరాయంగా ఉదయం 8.30గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి,తాళింపు(కర్రీ)ని,మసాలవడ రుచికరంగా వడ్డిస్తున్నారు. దీంతోబాటు పప్పు కూడా చేర్చాలని ఆలోచన కార్యరూపం దాల్చలేదు. అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాదాపు 3వేల కోట్లరూపాయలపైగానే ఎస్వీ అన్నప్రసాదంట్రస్టుకు నిధులు డిపాజిట్లురూపంలో ఉన్నాయి. దీనిద్వారా వచ్చే వడ్డీతోనే ప్రతిరోజూ తిరుమలలో భక్తులకు నాణ్యమైన రుచికరంగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్నారు..ప్రతిరోజూ 14 టన్నుల బియ్యం, 8టన్నుల కూరగాయలు వినియోగిస్తున్నారు.దాతలు కూడా రోజుకు 44లక్షలు రూపాయలు విరాళమిస్తే వారిపేరున అన్నప్రసాదాలు భక్తులకు వడ్డిస్తున్నారు. ఉదయం అల్పాహారం 12లక్షలు, మధ్యాహ్నం, రాత్రి భోజనం 32లక్షలు రూపాయలు వ్యయమవుతోంది. నవరాత్రి బ్రహ్మోత్స వాలకైనా అదనంగా మెనూలో పప్పు చేర్చినా భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తారు.



## ఘంటసాల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు

**తిరుపతి,అక్టోబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** నెలమొదటిన తిరుపతిలోని ఘంటసాల విగ్రహానికి గురు వారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు పాలాభిషేకం చేసి,విశేష పుష్పాంజలి ఘటించారు. అమరగాయకుడు,తెలుగువారి మది లో చిరస్థాయిగా నిలిచిన ఘంటసాల ప్రతి ఒక్క రికీ ఆదర్శప్రాయుడని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి కొనియాడారు. తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడని అన్నారు. ఈ సందర్భంగా ఘంట సాల అభిమానులు డాక్టర్ విద్వాన్ కస్పా పద్మనా భం, వాసుదేవ రెడ్డి లను ఘనంగా సన్మానిం చారు. భవానీనగర్‌కూడలిలో ఉన్న ఘంటసాల విగ్రహానికి రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుం డాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెఎన్ రాజా, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ఆంజనేయులు, చంద్రశేఖర్, కస్పాపద్మనాభం, ఉపాధ్యాయుడు తిరుమలయ్య, ఆదిస్వామి తదితరులు పుష్పాంజలి ఘటించారు.



2-10pg10exHMNWJQEBTA.qxd OK:2-10pg10exHMNWJQEBTA.qxd 1/1/02 7:11 AM Page 1



## ఆసియా క్రీడలు



# రెజ్లింగ్‌లో నితేష్‌కు రజతం

**నగోయా:** ఆసియా క్రీడల్లో, పురుషుల గ్రీకో రోమన్ 97 కేజీల రెజ్లింగ్‌లో భారత్‌కు చెందిన నితేష్ సివాచ్ రజత పతకం గెలుచుకోగా, మహిళల 62 కేజీల విభాగంలో మంగోలియాకు చెందిన అల్జిన్ టోగ్టోఖ్‌తో జరిగిన పతక పోరులో ఓడిపోవడంతో మాన్సీ అహ్లావత్ కాంస్య పతకాన్ని కోల్పోయింది. గురువారం నగోయాలో జరిగిన ఫైనల్‌లో జపాన్‌కు చెందిన యూరి నకజాటో చేతిలో 0–4 తేడాతో ఓడిపోయిన నితేష్, రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. 1962 ఆసియా క్రీడల తర్వాత ఈ ఖండాంతర ఈవెంట్‌లో గ్రీకోరోమన్ ఫైనల్‌కు చేరిన తొలి భారతీయుడిగా నిలిచినప్పటికీ, అతను తన ప్రచారాన్ని స్వర్ణ పతకంతో పూర్తి చేయలేకపోయాడు. కాంస్య పతకం కోసం జరిగిన పోరులో మాన్సీ, ఆల్జిన్ చేతిలో 2–5 తేడాతో ఓడిపోయింది. మాన్సీని బౌండరీ బయటకు నెట్టివేసి, ఆ మంగోలియన్ క్రీడాకారిణి ప్రారంభంలోనే 2–0 ఆధిక్యాన్ని సంపాదించి, మొదటి రౌండ్ మొత్తం అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. ఆ తర్వాత తన ప్రత్యర్థిని బౌండరీ బయటకు నెట్టడంతో మాన్సీ స్కోరును 2–2తో సమం చేసింది. అయితే, చివరి క్షణాల్లో ఆల్జిన్ మరో 2పాయింట్లు సాధించింది. స్కోరింగ్‌పై భారత దేశం చేసిన ఛాలెంజ్ విఫలమవడంతో, మంగోలియన్ క్రీడాకారిణికి మరో పాయింట్ లభించింది.

# ఫైనల్‌కు భారత్

### 169 పరుగుల తేడాతో శ్రీలంక చిత్తు



**నిస్షిన్:** ఆసియా గేమ్స్ రెండో సెమీఫైనల్‌లో భారత జట్టు అదరగొట్టి అద్భుత విజయం సాధించింది. గురువారం శ్రీలంకతో జరిగిన కీలక పోరులో 124 పరుగుల భారీ తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. కేవలం 9.5 ఓవర్లలోనే శ్రీలంక 45 పరుగులకు ఆలౌట్ అయింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. శ్రీలంక కనీస పోటీ ఇవ్వలేకపోయింది. నేపాల్, హాంగ్ కాంగ్ కంటే అధ్వాన్నంగా ఆడింది. 170 పరుగుల లక్ష్యం ముందు శ్రీలంకకు మంచి ఆరంభం దక్కలేదు. ఇన్నింగ్స్ రెండో ఓవర్ పూర్తయ్యేలోపే మూడు వికెట్లు కోల్పోయిన లంకపై భారత బౌలర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. వికెట్లు వరుసగా పడటంతో శ్రీలంక బ్యాటర్లపై ఒత్తిడి మరింత పెరిగింది. స్కోరుబోర్డుపై పరుగులు వేగంగా చేరకపోవడంతో లక్ష్యాన్ని అందుకోవడం కష్టంగా మారింది. జస్‌ప్రీత్ బుమ్రా వేసిన తొలి ఓవర్‌లోనే శ్రీలంక ఒక్క పరుగు చేయకుండానే రెండు వికెట్లు కోల్పోయింది. రవి బిష్ణోయ్ వేసిన రెండో ఓవర్‌లో రనౌట్ రూపంలో మరో వికెట్ పడగా, నాలుగో ఓవర్‌లో అక్షర్ పటేల్ మరో రెండు వికెట్లు పడగొట్టాడు. ఐదో ఓవర్‌లో కాస్త నిలకడగా ఆడిన నువానిడు ఫెర్నాండో(15) కూడా రనౌట్ అయ్యాడు. ఏడో ఓవర్‌లోవాషింగ్టన్ సుందర్ మరో వికెట్ పడగొట్టగా, 10వ ఓవర్‌లో అభిషేక్ శర్మ 2 వికెట్లు తీసాడు. అదేఓవర్‌లో తారిందు రత్నాయకే రనౌట్ అయ్యాడు. 9.5 ఓవర్ల వద్ద చివరి వికెట్ పడటంతో శ్రీలంక ఇన్నింగ్స్ ముగిసింది. తొలుత భారత బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ 80 పరుగులతో ప్రధాన పాత్ర పోషించాడు. వాషింగ్టన్ సుందర్ 7 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత్ 20 ఓవర్లలో 169/7 స్కోరు సాధించింది. చివరి ఓవర్‌లో 18 పరుగులు రావడం కూడా భారత స్కోరునుపెంచింది. ఆతర్వాత బౌలింగ్‌లోనూ అదేజోరును కొనసాగించిన భారత్, శ్రీలంకను 45 పరుగులకే పరిమితం చేసింది. 124 పరుగుల విజయంతో సెమీఫైనల్‌ను ముగించిన టీమిండియా ఇప్పుడు ఆసియా గేమ్స్ ఫైనల్‌లో స్వర్ణ పతకం కోసం పోరాడనుంది. శ్రీలంకకు మాత్రం ఈ ఓటమితో టైటిల్ రేసు ముగిసింది.

# ఫైనల్‌కు పాకిస్థాన్

### బంగ్లాదేశ్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపు

**నిస్షిన్:** కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో వర్షం కారణంగా అంతరాయం కలిగిన పురుషుల క్రికెట్ సెమీఫైనల్‌లో పాకిస్థాన్ గురువారం ఆరు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్ ఖరారు చేసుకుంది. రోజంతా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా అవుట్‌ఫీల్డ్ ఆటకు అనుకూలంగా లేకపోవడంతో, మ్యాచ్‌ను ఇరు జట్లకు 13 ఓవర్లకు కుదించారు, బంగ్లాదేశ్ నిర్దేశించిన 111/7 స్కోరును పాకిస్థాన్ 11.3 ఓవర్లలో ఛేదించి, తొమ్మిది బంతులు మిగిలి ఉండగానే 112/4 స్కోరుతో ముగించింది. పాకిస్థాన్ స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడానికి బంగ్లాదేశ్ చాలా ఇబ్బంది పడింది. సుఫ్యాన్ మోకిమ్ 3/26తో రాణించగా, అరఫత్ మిన్హాస్ 2/23తో వికెట్లు పడగొట్టాడు. సైమ్ అయూబ్ ముఖ్యంగా పొదుపుగా బౌలింగ్ చేసి, తన రెండు ఓవర్లలో కేవలం మూడు పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ కూడా తీశాడు. తంజిద్ హసన్ తమీమ్, కెప్టెన్ లిట్టన్ దాస్, పర్వేజ్ హుస్సేన్ ఎమోన్, సైఫ్ హసన్‌ల వికెట్లు కోల్పోవడంతో, 6.3 ఓవర్లలో బంగ్లాదేశ్ 45/4 స్కోరుకు పడిపోయింది. ఆ తర్వాత తౌహిద్ హృదయ్ 42 పరుగులు చేసి జట్టుకు ఊపునివ్వగా, మొసాడెక్ హుస్సేన్ 11 పరుగులు చేశాడు. మహేది హసన్, సాహిబ్జాదా ఫర్హాన్‌ను ఔట్ చేయడంతో పాకిస్థాన్ కూడా ఆరంభంలోనే ఒత్తిడిని ఎదుర్కొంది. అయితే, మాజ్ సదాకత్(15), ఉస్మాన్ ఖాన్(14), అయూబ్(21)ల మెరుపు ఇన్నింగ్స్‌లు ఛేజింగ్‌ను సరైన మార్గంలో ఉంచాయి. పాకిస్థాన్ 76/4 స్కోరు వద్ద ఉండగా ముస్తఫిజుర్ రెహమాన్ వేసిన ఒకే ఓవర్‌లో అబ్దుల్ సమద్ 22 పరుగులు బాదగా, హసన్ నవాజ్ 22 బంతుల్లో 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. సమద్ 15బంతుల్లో 30పరుగులతో నాటౌట్‌గా నిలవగా, 12వఓవర్‌లో నవాజ్ విజయపు బౌండరీని సాధించాడు. ఈ ఫలితంతో పాకిస్థాన్ ఆసియా క్రీడల్లో తొలిసారిగా పురుషుల క్రికెట్ ఫైనల్‌కు చేరుకుంది.

# హాకీలో పాక్ ఓటమి

### 4-3 తేడాతో ఫైనల్‌కు భారత్

**కకమిగహార:** ఆసియా గేమ్స్, పురుషుల హాకీ సెమీఫైనల్‌లో, పాకిస్థాన్‌పై భారత్ 4-3 తేడాతో విజయం సాధించి ఫైనల్‌లోస్థానం దక్కించుకుంది. తద్వారా డిఫెండింగ్ ఛాంపియన్లకు మరోపతకం ఖాయమైంది. వరుస పెనాల్టీ కార్నర్ల తర్వాత, 5వ నిమిషంలో పాక్ గోల్ కీపర్ మునీబ్‌ఉర్‌రెహ్మాన్ పక్క నుండి బంతిని నెట్‌లోకి పంపి హర్మన్‌ప్రీత్ స్కోరింగ్‌ను ప్రారంభించాడు. 13వ నిమిషంలో మరో శక్తివంతమైన పెనాల్టీ కార్నర్ షాట్‌తో అతను భారత్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. సుఖ్‌జీత్ సింగ్ (23వ) ఆధిక్యాన్ని 3–0కి పెంచాడు. అబు మహమూద్ (30వ) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడంతో పాకిస్థాన్ ఆధిక్యాన్ని తగ్గించింది. హన్నన్ షాహిద్ (45వ) గోల్ చేసి స్కోరును 3–2కు తగ్గించగా, చివరి క్వార్టర్ ప్రారంభమైన మూడు నిమిషాలకే రాణా వాహిద్ స్కోరును సమం చేసి, షూటౌట్‌కు దారితీసే అవకాశాన్ని పెంచాడు. అయితే, చివరి నిమిషంలో అభిషేక్ గోల్ చేయడంతో భారత్‌కు తిరిగి ఆధిక్యాన్ని అందించింది. చివరి హూటర్ మోగేలోపు పాకిస్థాన్ మరో సమం చేసే గోల్‌ను సాధించలేకపోయింది. ఈ విజయంతో పాకిస్థాన్‌పై భారత్ అజేయ పరంపర 21 మ్యాచ్‌లకు చేరింది.



# ఆర్చరీలో గణేష్‌కు కాంస్యం

**ఒకాజాకి:** భారత కాంపౌండ్ ఆర్చర్ గణేష్ మణి రత్నం తిరుమూరు ఆసియా క్రీడల్లో పురుషుల వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించడంతో, ఐచినగోయా క్రీడల్లో ఆర్చరీ విభాగంలో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. ఒకాజాకిలో గురువారం జరిగిన కాంస్య పతక పోరులో గణేష్, వియత్నాంకు చెందిన కాంగ్ డక్ డాంగ్‌ను 149–144 తేడాతో ఓడించాడు. గణేష్ చివరిలో అద్భుతంగా ఆడి, 14 సార్లు 10 పాయింట్లు సాధించి, చివరగా వరుసగా మూడు10 పాయింట్లతోతన వియత్నాం



ప్రత్యర్థిపై ఆధిక్యం సాధించి మూడవ స్థానాన్ని దక్కించుకున్నాడు. బుధవారం జరిగిన పురుషుల టీమ్ కాంపౌండ్ ఈవెంట్‌లో భారత్ స్వర్ణం గెలవడంలో సహాయపడిన తర్వాత, ప్రస్తుతం జరుగుతున్న క్రీడల్లో గణేష్‌కు ఇది రెండవ పతకం. కాగా భారత్ కాంపౌండ్ ఆర్చరీ పోటీలను టీమ్ ఈవెంట్లలో మూడు స్వర్ణ పతకాలతో, వ్యక్తిగత పోటీలలో ఒక కాంస్య పతకంతో ముగించింది.




# వాలీబాల్‌లో పాక్ విజయం

### భారత్ వరుస సెట్లలో ఓటమి

**ఒకాజాకి:** ఐచినగోయా 2026 గేమ్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో పాకిస్థాన్ వరుస సెట్లలో భారత్‌ను ఓడించింది. ఒకాజాకిలో గురువారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 25-19, 25-23, 25-18 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్స్‌లో స్థానం ఖాయం చేసుకుంది. ఈ ఫలితంతో 64 ఏళ్లలో ఆసియా క్రీడల్లో పురుషుల వాలీబాల్‌లో పాకిస్థాన్ తొలిసారిగా టాప్ ఫోర్‌లో స్థానం దక్కించుకుంది. తొలి సెట్ ఆరంభంలో హోరాహోరీగా సాగింది, ఇరు జట్లు 11–11తో సమంగా నిలిచాయి.

ఆ తర్వాత పాకిస్తాన్ వరుసగా ఐదు పాయింట్లు సాధించి 16–11 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అదే ఆధిక్యాన్ని కొనసాగించి సెట్‌ను 25–19 తేడాతో కైవసం చేసుకుంది. రెండో సెట్‌లో 19–16 ఆధిక్యం సాధించడంతో భారత్ పట్టు సాధించినట్లే కనిపించింది. అయితే, వరుస తప్పిదాల కారణంగా పాకిస్థాన్ పుంజుకుని సెట్‌ను 25–23తో కైవసం చేసుకుంది, దీంతో భారత్ రెండు సెట్లు వెనుకబడింది. మూడవ సెట్‌లో పాకిస్తాన్ ఆధిపత్యం కొనసాగించి 25–18 తేడాతో విజయాన్ని పూర్తి చేసింది.పూల్ సిలో మూడు విజయాలతో అగ్రస్థానంలో నిలిచిన భారత్, అజేయంగా నాకౌట్ దశలోకి ప్రవేశించింది.

# బిఎస్ఎన్ఎల్ బంపర్ ఆఫర్

### ఆ ప్లాన్లు వేసుకుంటే రూ.లక్ష బీమా

#### రూ.10వేల వరకు సైబర్ ఫ్రాడ్ నుంచి ఆర్థిక రక్షణ

**ముంబై, అక్టోబరు 1:** ప్రభుత్వరంగ టెలికం సంస్థ బిఎస్ఎన్ఎల్, తన కస్టమర్లను ఆకట్టుకునేందుకు ఒక వినూత్నమైన ఆఫర్‌తో ముందుకొచ్చింది. ఎంపిక చేసిన రెండు ప్రిపెయిడ్ ప్లాన్‌లపై లక్ష రూపాయల వరకు ఉచిత బీమాతోపాటు సైబర్ ఫ్రాడ్ కవరేజీని అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త సదుపాయం అక్టోబరు 1నుంచి అమల్లోకి వచ్చింది. దేశంలో ఒక టెలికం ఆపరేటర్ రీఛార్జ్ ప్లాన్‌తో ఉచిత బీమాను అందించడం ఇదే తొలిసారని బిఎస్ఎన్ఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఆఫర్ కోసం బిఎస్ఎన్ఎల్, ప్రముఖ ప్రభుత్వ రంగ బీమా సంస్థ అయిన ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చు కుంది.

# సెప్టెంబరులో జిఎస్‌టి వసూళ్లు రూ.2.04 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, అక్టోబరు 1:** జిఎస్‌టి వసూళ్లు మరోసారి రూ.2 లక్షల కోట్ల మార్క్‌ను దాటాయి. సెప్టెంబరులో స్థూల జిఎస్‌టి వసూళ్లు 14.7 శాతం పెరిగి రూ.2,03,521 కోట్లకు చేరాయి. గతేడాది సెప్టెంబరులో రూ.1,77,173 కోట్లుగా ఉన్న వసూళ్లతో పోలిస్తే ఈసారి గణనీయమైన పెరుగుదల నమోదైంది. వరుసగా మూడో నెలలోనూ జిఎస్‌టి వసూళ్లు రూ.2 లక్షల కోట్లకు చేరువగా లేదా అంతకుమించి ఉండటం గమనార్హం.సెప్టెంబరులో కేంద్ర జిఎస్‌టి (సిజిఎస్‌టి) ద్వారా రూ.37,762 కోట్లు, రాష్ట్ర జిఎస్‌టి (ఎస్‌జిఎస్‌టి) ద్వారా రూ.45,363 కోట్లు వచ్చాయి. ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి (ఐజిఎస్‌టి) వసూళ్లు రూ.1,20,396 కోట్లుగా నమోదయ్యాయి. సెటిల్‌మెంట్ల తర్వాత నికర జిఎస్‌టి ఆదాయం 18.1 శాతం పెరిగి రూ.1,76,520 కోట్లకు చేరింది. దేశీయంగా వసూలైన జిఎస్‌టి ఆదాయం కూడా పెరిగింది. సెప్టెంబరులో ఇది 10.1 శాతం వృద్ధితో రూ.1,37,996 కోట్లకు చేరింది. దిగుమతులపై వసూలైన జిఎస్‌టి ఆదాయం పెరగడం మొత్తం వసూళ్ల వృద్ధికి ప్రధానంగా దోహదం చేసింది.







# నాలుగో రోజూ నష్టాలే

### సెన్సెక్స్ 571, నిఫ్టీ 22,450 పాయింట్లు డౌన్

**ముంబై, అక్టోబరు 1:** పెరుగుతున్న ఇంధన ధరలు, అస్థిరమైన బాండ్ దిగుబడులు, మరింత ద్రవ్య బిగింపునకు అవకాశంపై పెరిగిన ఆందోళనల మధ్య, దేశీయ ఈక్విటీ మార్కెట్ గురువారం భారీ నష్టాలతో ముగిసింది. వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లో కూడా నష్టాలు కొనసాగాయి. సెన్సెక్స్ 570.59 పాయింట్లు లేదా 0.79 శాతం క్షీణించి 71,909.70 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 198.50 పాయింట్లు లేదా 0.88 శాతంపడిపోయి 22,421.95 వద్ద ముగిసింది.



నిఫ్టీ సాంకేతిక దృక్పథంపై వ్యాఖ్యానిస్తూ, నిపుణులు నిఫ్టీ తన వారపు 200ఎస్ఎంఎ జోన్ అయిన 22,600- 22,580 దిగువకు పడిపోయిందని, 22,400 వద్ద అంచనా వేసిన మద్దతును దాదాపుగా పరీక్షించిందన్నారు. “22,400 స్థాయిని కాపాడుకోవడంలో విఫలమైతే, మార్కెట్ బలహీనత 22,200–22,000 స్థాయిల వైపు విస్తరించవచ్చు, కాగా 22,600–22,800 స్థాయిలు ఇప్పుడు తక్షణ నిరోధక శ్రేణిగా మారాయ్ని అని మార్కెట్ పరిశీలకులు పేర్కొన్నారు. ఇంధన ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. అంతర్జాతీయ బాండ్ మార్కెట్లలో మార్పులు కూడా మదుపరులను అప్రమత్తం చేశాయి. దీంతో పలు రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. నిఫ్టీలో బజాజ్ ఆటో, మారుతి సుజుకి ఇండియా, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఆటో, ఆర్థిక రంగ షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.01 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.97 శాతం చొప్పున పడిపోయాయి. ఆటోమొబైల్, మీడియా, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాలు ఎక్కువగా నష్టపోయాయి. ఐటీ షేర్లు మాత్రం మార్కెట్‌కు కొంత మద్దతుగా నిలిచాయి.

రంగాల వారీగా చూస్తే, ఆటోమొబైల్, మీడియా, మెటల్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎక్కువగా ఎదుర్కొన్నాయి. రంగాల వారీ సూచీలలో, నిఫ్టీ ఆటో, నిఫ్టీ మీడియా, నిఫ్టీ మెటల్, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీలు అత్యంత తీవ్రమైన క్షీ ణతను నమోదు చేశాయి. దీనికి విరుద్ధంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాక్స్ మార్కెట్‌కు కొంతమేర మద్దతునిచ్చాయి. ఈ సెషన్‌లో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన రంగంగా నిలిచింది. “దీర్ఘకాలిక పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను కొనసాగించి, మార్కెట్ బలహీనతను ఉపయోగించుకుని క్రమంగా కొనుగోళ్లు పెంచుకోవచ్చు. మరోవైపు, అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వం నుండి బలమైన చర్యలు వచ్చి ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో స్థిరత్వాన్ని పునరుద్ధరించే వరకు స్వల్పకాలిక పెట్టుబడిదారులు వేచి చూసే ధోరణిని అవలంబించవచ్చు అని విశ్లేషకులు పేర్కొన్నారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.